ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 14 నవంబరు 2025



నక్కపల్లిలో టాయ్ పార్క్

ఎకోసిస్టమ్‌తో బొమ్మల తయారీ యూనిట్లు

- 1,054 ఎకరాలు అవసరమని గుర్తింపు
- 20 వేల మంది మహిళలకు ఉపాధి
- విశాఖ సీఐఐ సదస్సులో ఎంఓయూ ?



టాయ్ పార్క్ ఏర్పాటుపై కలెక్టర్‌తో చర్చిస్తున్న హోం మంత్రి అనిత (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలో మరో భారీ కంపెనీ ఏర్పాటు కానున్నది. పిల్లలు ఆడుకునే వివిధ రకాల బొమ్మల తయారీ పరిశ్రమ కోసం 1,054 ఎకరాలు అవసరమని అధికారులు నిర్ధారించారు. దీనిని ఎన్.నర్సాపురం, బుచ్చిరాజుపేట, నల్లమట్టిపాలెం, ఉపమాక, పరిసర గ్రామాల్లో ఏర్పాటు చేసే అవకాశం వుందని సమాచారం. చైనా తరహాలో ఎకోసిస్టమ్‌తో బొమ్మల తయారీ యూనిట్లను ఏర్పాటు చేసి వీటిల్లో సుమారు 20 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించాలన్న ఆలోచనతో ప్రభుత్వం వుంది. కాలుష్యరహిత పరిశ్రమ కావడంతో ప్రభుత్వం సుముఖంగా వున్నట్టు తెలిసింది. దీనికి సంబంధించి కలెక్టర్ విజయకృష్ణన్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌తో హోం మంత్రి అనిత పలుమార్లు చర్చించారు. శుక్ర, శనివారాల్లో విశాఖలో జరగనున్న సీఐఐ పెట్టుబడిదారుల సదస్సులో 'టాయ్ పార్క్' ఏర్పాటుపై ఒప్పందం జరగనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

అంచనాలకు మించి పెట్టుబడులు

మారనున్న విశాఖ రూపురేఖలు

- గూగుల్‌తో పాటు మరో డేటా సెంటర్ ఏర్పాటు

- అభివృద్ధికి అనుగుణంగా మౌలిక వసతులు పెంచుకోవాలి
- జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందించుకుని శరవేగంగా అమలుచేయాలి
- పెట్టుబడులు వస్తున్నందున విశాఖ ఎకనామిక్ జోన్ ఇటు శ్రీకాకుళం నుంచి అటు కోనసీమ వరకూ విస్తరణ
- యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు
- అనకాపల్లి నుంచి విజయనగరం మీదుగా శ్రీకాకుళం వరకూ రింగ్ రోడ్డు ప్రతిపాదన
- చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఎక్కువ అవకాశాలు
- ప్రజలకు ప్రతి విషయం వివరించండి... మీ కెరీర్‌లో ల్యాండ్‌మార్క్‌గా నిలబోతుంది
- విశాఖ ప్రజా ప్రతినిధులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



సీఎం చంద్రబాబు నాయుడుతో తైవాన్‌కు చెందిన ప్రతినిధులు

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): "అంచనాలకు మించి విశాఖపట్నానికి పెట్టుబడులు వస్తున్నాయి...ఇంత భారీ స్పందన వస్తుందని ఊహించలేదు. గూగుల్ డేటా సెంటర్‌తోపాటు వన్ గిగావాట్ సామర్థ్యంలో మరో పెద్ద సంస్థ విశాఖలో డేటా సెంటర్ నెలకొల్పబోతోంది. వాటికి అనుబంధంగా మరికొన్ని పరిశ్రమలు వస్తుండడంతో విశాఖ రూపురేఖలు మారబోతున్నాయి"...అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం ఉదయం పోర్టు అతిథిగృహం ఆవరణలో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులతో ఆయన ముచ్చటించారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు రాష్ట్రంలో గేమ్ ఛేంజర్‌గా పేర్కొన్నారు. ప్రధానంగా అభివృద్ధిపరంగా విశాఖ మౌలిక స్వరూపం మారుతుందన్నారు. గూగుల్ తరహాలో మరో పెద్ద కంపెనీ ఒక గిగావాట్ సామర్థ్యంతో డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు చేయబోతోందన్నారు. దీనిపై ఈ రోజు (గురువారం సాయంత్రం) ప్రకటన వెలువడనున్నదన్నారు. వీటితోపాటు మరికొన్ని కంపెనీలు విశాఖకు రానుండడంతో మౌలిక వసతులు పెంచుకోవలసిన అవసరం ఉందన్నారు. ఇందుకు అనుగుణంగా నగరం, పరిసరాల్లో వసతుల కల్పన దిశగా జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందించుకుని శరవేగంగా అమలు చేయాలన్నారు. కంపెనీల రాకతో ఉత్తరాంధ్రలో యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.



సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

భారీ పెట్టుబడులతో కంపెనీలు వస్తున్నందున విశాఖ ఎకనామిక్ రీజియన్ పరిధిని ఇటు శ్రీకాకుళం, అటు కోనసీమ వరకూ విస్తరిస్తున్నామన్నారు. ఈ రీజియన్ ఆర్థికంగా పురోగతి సాధించే క్రమంలో వసతులు అంతేస్థాయిలో పెంచుకోవాలన్నారు. రీజియన్ అభివృద్ధిలో ... మిగతా 8వ పేజీలో

పాఠశాల ఈతకొలనులో

విద్యార్థి మృతి

గోప్యంగా ఉంచిన యాజమాన్యం

- కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు
- పాఠశాలకు ఫోన్.. స్పందన రాకపోవడంతో హుటాహుటిన స్కూల్‌కు చేరిక
- స్విమ్మింగ్ పూల్ పక్కన బాలుడి మృతదేహం
- యాజమాన్యం నిర్లక్ష్యంపై మండిపాటు
- పాఠశాల నిర్వాహకులు రావాలంటూ ఆందోళన.. రోడ్డుపై బైఠాయింపు



మోక్షిత్‌సందీప్ (ఫైల్‌ఫొటో)



కుమారుడి మృతదేహాన్ని పట్టుకుని రోదిస్తున్న తల్లి

మునగపాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేటలో వున్న డావిన్సీ స్కూల్‌లో ఈతకొలనులో పడి విద్యార్థి మృతి చెందాడు. అయితే పాఠశాల నిర్వాహకులు ఈ విషయాన్ని గోప్యంగా వుంచి, మిగిలిన విద్యార్థులను యథావిధిగా ఇళ్లకు పంపించేశారు. బాలుడి మృతిదేహాన్ని ఈతకొలను ... మిగతా 8వ పేజీలో

అచ్యుతాపురం తహసీల్దార్ బదిలీ

- ఎక్కడా పోస్టింగు ఇవ్వని కలెక్టర్
- కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశం
- ఇటీవల సీఐ గణేశ్ బదిలీ
- భోగాపురం భూ వివాదమే కారణమని ఊహాగానాలు
- త్వరలో మరో అధికారిపై బదిలీ వేటు?

- 8లో

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఏఈఈ సస్పెన్షన్

వాటర్ ట్యాంకు నిర్మాణంలో నాణ్యతా లోపం

- హోం మంత్రి అనిత ఫిర్యాదుతో కలెక్టర్ చర్యలు
- బ్లాక్ లిస్టులోకి కాంట్రాక్టర్
- వాటర్ ట్యాంకును తనిఖీ చేసిన ఉన్నతాధికారులు



వాటర్ ట్యాంకు నాణ్యతను తనిఖీ చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు, క్వాలిటీ కంట్రోల్ అధికారులు

ఎస్.రాయవరం, నంవబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెట్టుగోళ్లపల్లిలో నాణ్యతా లోపంతో నిర్మించిన వాటర్ ట్యాంకు... ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల మెడకు చుట్టుకుంది. నక్కపల్లి డీఈఈ వై.ఆనంద్, ఎస్.రాయవరం ఏఈఈ ఎం.మనోజ్ కల్యాణ్‌లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ విజయకృష్ణన్ ఉత్తర్వులు జారీచేశారు. పెట్టుగోళ్లపల్లిలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద నిర్మించిన వాటర్ ట్యాంకును బుధవారం ప్రారంభించడానికి వెళ్లిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత.. ట్యాంకు లీక్ అవుతుండడాన్ని గమనించారు. నిర్మాణంలో నాణ్యతా లోపంపై అక్కడే ఉన్న ... మిగతా 8వ పేజీలో

ధాన్యం కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

» ఏడీఏ కె.ఉమాప్రసాద్



సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీఏ కె.ఉమాప్రసాద్

పాయకరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు చేసే సమయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ కె.ఉమాప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్ కార్యాలయంలో ఐదు మండలాల ఏఓలు, ఏఈఓలు, రైతు సేవా కేంద్రాల నోడల్ అధికారులకు ధాన్యం సేకరించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యానికి ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర, రవాణా అంశాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. అదేవిధంగా ఈ-పంట సోషల్ ఆడిట్ నిర్వహించాలని, రబీ విత్తనాలకు ఇండెంట్‌ని సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో ఆదినారాయణ, వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కొండకర్ల ఆవ మత్స్యకారులకు చేయూతనిద్దాం'



మత్స్యకారులకు రగ్గులు పంపిణీ చేసిన దృశ్యం

అచ్యుతాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొండకర్ల ఆవ మత్స్యకారులకు చేయూతనివ్వాలని ఏక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్ ఫెసిలిటేటర్ ఐ కృష్ణకుమారి అన్నారు. గురువారం కొండకర్ల ఆవలో చేపలు పట్టి జీవిస్తున్న కొండకర్ల, వాడ్రాపల్లి, మల్లవరానికి చెందిన 256 మంది మత్స్యకారులకు రగ్గులు, టార్చిలైట్లు, దోమల నివారణ అగర్‌బత్తీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొండకర్ల ఆవ ల్యాండ్ ఫిషర్‌మేన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రమణ, అప్పారావు, దుర్గారావు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీఓ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం పాల్గొన్నారు.

నేడు తెలుగు రాష్ట్రాల్లో 'మా ఊరి వెంకన్న' రిలీజ్

» చిత్ర దర్శకుడు కోరుకొండ గోపి



అడ్వాన్స్ టిక్కెట్లను అందజేస్తున్న చిత్ర దర్శకుడు కోరుకొండ గోపి

మునగపాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): యజ్ఞశ్రీ బ్యానర్‌పై నిర్మించిన 'మా ఊరి వెంకన్న' చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో ఈనెల 14న రిలీజ్ చేస్తున్నామని దర్శకుడు కోరుకొండ గోపి, నిర్మాత వెలవలపల్లి కోటేశ్వరశర్మ తెలిపారు. మునగపాకలో గురువారం స్థానికులతో కలిసి ఇష్టాగోష్టి నిర్వహించారు. దర్శక, నిర్మాతలిద్దరు మునగపాక గ్రామానికి చెందిన వారు కావడంతో సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గ్రామానికి చెందిన పలువురు అడ్వాన్స్ టిక్కెట్లను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు బొడ్డేడ అప్పలనాయుడు, టీడీపీ నాయకులు వెలగా మురళి, దాడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

దీక్షాపరులకు బిక్ష

నక్కపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో గురువారం అయ్యప్ప, శివ, భవానీ దీక్షాపరులకు బిక్షను ఏర్పాటు చేశారు. ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ పెంకులరాజు, వేదపండితుడు పండుశర్మ, శ్రీపాద ప్రణవ్‌రాం తదితరులు దీక్షా పరులకు బిక్షను సమకూర్చారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త కొప్పిశెట్టి వెంకటేశ్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి, కేవీ సత్యనారాయణ, బీజేపీ నేత కోసూరి శ్రీను, రిటైర్డ్ వీఆర్వో డీవీ రామారావు తదితరులు బిక్ష దాతలను అభినందించారు.

నేత్ర వైద్య శిబిరంలో 50 మందికి పరీక్షలు



.రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మునగపాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక గణేశ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మంది రోగులకు వైద్య పరీక్షలు జరిపారు. వారిలో 15 మందికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. మిగిలిన వారిలో అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శిబిరం నిర్వాహకుడు దాడి సాంబ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బిగ్ హెల్ప్ పురస్కారాలు



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న బిగ్‌హెల్ప్ సంస్థ చైర్మన్ చాంద్ పాషా

నక్కపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురం జడ్పీ హైస్కూల్‌లో నిరుపేద విద్యార్థులు, ప్రతిభావంతులను గురువారం బిగ్‌హెల్ప్ సంస్థ చైర్మన్ చాంద్ పాషా, జోనల్ డైరెక్టర్ కోడి శ్రీనివాసరావు గోల్డెన్ స్టార్ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఆర్ నాగన్నదొర మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకోవడంలో బిగ్‌హెల్ప్ సేవలు విశేషమైనవని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నీలకంఠకుమార్, ప్రభాకర్, సర్పంచ్ వెంకటేశ్, ఎంపీటీసీ సభ్యుడు బచ్చలరాజు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జీ, స్కూల్ కమిటీ చైర్మన్ వెలగా శ్రీను, టీడీపీ నాయకుడు కుర్రా బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



వాడపాలెం సముద్రతీరం



తీరం ఒడ్డున ఆకర్షిస్తున్న శివపార్వతుల విగ్రహాలు



కనువిందు చేస్తున్న కొబ్బరి తోటలు

రమణీయం.. వాడపాలెం సాగర తీరం

రాంబిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆహ్లాదకర వాతావరణం.. అందమైన ఇసుక దిబ్బలు ప్రకృతి ప్రేమికులను అలరిస్తోంది మండలంలోని వాడపాలెం సాగర తీరం. కార్తీక మాసంలో తీరంలో పిక్నిక్‌ల సందడి నెలకొంటుంది. తీరం వద్ద మెట్టపై గంగాదేవి అమ్మవారి గుడి, శివపార్వతుల విగ్రహాలు ఉన్నాయి. తీరం వెంబడి కిలోమీటర్ల మేరకు కొబ్బరి, జీడి మామిడి, సరుగుడు తోటలు విస్తరించి ఉన్నాయి. ఇక్కడ పిక్నిక్‌లకు జిల్లా నలుమూలలు నుంచి కుటుంబాలతో అధిక సంఖ్యలో వస్తుంటారు. ఆటపాటలతో గడిపిన తర్వాత సముద్రంలో స్నానాలు చేస్తారు. రాంబిల్లికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాడపాలెం తీరం వరకు రోడ్డు సదుపాయం ఉంది. నేరుగా పర్యాటకులు రోడ్డు మార్గంలో వాహనాలు ద్వారా చేరుకోవచ్చు.

ఆ రోడ్డులో ప్రయాణం.. ప్రాణ సంకటం

» ఎక్కడికక్కడే పెద్ద పెద్ద గోతులు

» శంకుస్థాపన జరిగి ఏడాదవుతున్నా ప్రారంభం కాని పనులు

» అధ్వానంగా అడ్డరోడ్డు-నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డు



చినగుమ్ములూరు సమీపంలో గోతులతో ఉన్న రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనం

ఎస్.రాయవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డు నుంచి నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఈ రోడ్డు ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తోంది. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు చేస్తుంటాయి. రోడ్డు పొడవునా ప్రమాదకరంగా గోతులు దర్శనమిస్తుండడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు మృత్యువాత పడగా.. పలువురు వాహనదారులు తీవ్రగాయాలు పాలయ్యారు. అయితే ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్ కొంతవరకు పనులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ రోడ్డు నిర్మాణానికి గత నవంబరులో దార్లపూడి వద్ద రాష్ట్ర హోం మంత్రి అనిత రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. దార్లపూడి జంక్షన్ వద్ద 300 మీటర్ల సీసీ రోడ్డు నిర్మించారే తప్ప మిగతా పనులు ఎక్కడా చేయలేదు. ఏడాది అవుతున్నా పనులు పునః ప్రారంభం కాకపోవడంపై ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కోటవురట్లలో మంచు సోయగం



కోటవురట్లలో మంచులో లైట్లు వేసుకొని వస్తున్న ఆటో

కోటవురట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాలను తలపించేలా మండలంలో మంచు కురుస్తోంది. గురువారం ఉదయం మంచు వర్షంలా పడింది. దీంతో వాహన చోదకులు లైట్లు వేసుకొని వెళ్లాల్సి వచ్చింది. తొమ్మిది గంటల వరకు సూర్యుడు కనిపించలేదు. కోటవురట్ల, తంగేడు, కైలాసపట్నం, రాజుపేట, జల్లూరు గ్రామాల్లో సూర్యుడు నడినెత్తికి వచ్చేసరికి ఎండకు ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రజలు శ్లాబు ఇళ్లపైకి ఎక్కి మంచు కురవడాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

పని దినాలు కల్పనలో వెనుకబడిన మండలం : ఎంపీడీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పక్కాగృహాలు నిర్మాణ లబ్దిదారులకు పనిదినాలు కల్పించడంలో మండలం జిల్లాలో వెనుకబడి ఉన్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. గురువారం స్థానిక మండలపరిషత్‌లో ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయాలు ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం, హౌసింగ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. కింద స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా కారణంగా జిల్లా స్థాయి సమావేశంలో తాను తప్పుచేసినట్టు నిలబడాల్సి వస్తుందన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు పనిదినాలు కల్పించే విధంగా చర్య లు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, మండల ఇంజనీర్ వర్మ, హౌసింగ్ ఏఈ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మా.. నీవే దిక్కమ్మా..

బల్క్‌డ్రగ్ పార్కుని అడ్డుకోవాలని రాజయ్యపేట మత్స్యకారుల పూజలు



గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న రాజయ్యపేట మత్స్యకారులు

నక్కపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్క్ రాకుండా తమను కాపాడాలని రాజయ్యపేట మత్స్యకారులు గురువారం గ్రామదేవత నూకతాతకు, సముద్రం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా నూకతాత ఆలయానికి వెళ్లి మత్స్యకారులు పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి సముద్రతీరం వరకూ వెళ్లి అక్కడ గంగమ్మతల్లికి పూజలు చేశారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు, యువకులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో పంచాయతీ బోర్డు తొలగింపు

» పోలీసులకు ఫిర్యాదు చేసిన డిప్యూటీ ఎంపీడీవో



వివాదాస్పద స్థలంలో పంచాయతీ బోర్డును తొలగించిన దృశ్యం



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ కె.డేవిడ్

పాయకరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఆర్ గెస్టుహౌస్ ఎదుట మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న వివాదాస్పద స్థలంలో ఏర్పాటుచేసిన పంచాయతీ బోర్డు తొలగించారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి డేవిడ్ గురువారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి.

పట్టణంలోని సర్వే నం.132/3లో 1.74 ఎకరాల్లో వేసిన లేఅవుట్‌ని 1985లో పంచాయతీ ఆమోదించారు. ఈ లేఅవుట్‌లో పంచాయతీకి కేటాయించిన స్థలంలో గత నెలలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే ఈ బోర్డును పంచాయతీకి సమాచారం లేకుండా తొలగించారు. దీనిపై గురువారం చేపట్టిన విచారణలో విశాఖపట్నంకి చెందిన కనుమూరి నర్సింహరాజు అనే వ్యక్తి స్వయంగా తొలగించినట్టు తేలిందని డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్ తెలిపారు. ఈ స్థలానికి సంబంధించి తలెత్తిన వివాదంపై కోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉండగా.. సర్సింహరాజు హెచ్చరిక బోర్డును తొలగిండంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

ఘనంగా దార్లపూడి మరిడిమాంబ జాతర





మరిడిమాంబ ఆలయం వద్ద కిటకిటలాడుతున్న జనాలు

ఎస్.రాయవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడిలో గల మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్‌లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం నుంచి గ్రామంలో భారీ తీర్థం సాగింది. రాత్రికి ఆలయం వద్ద భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. రాత్రికి డాన్స్ బేబీ డాన్స్‌తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోటవురట్లకు చేరిన అభ్యుదయ సైకిల్ యాత్ర



కోటవురట్లలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నేత కాశీనాయుడు

కోటవురట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నిర్మూలనకు విశాఖపట్నం రేంజ్ పరిధిలో పోలీస్ శాఖ చేపట్టిన అభ్యుదయ సైకిల్ ర్యాలీ గురువారం కోటవురట్లకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎస్ఐ రమేశ్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల విద్యార్థులు, యువకులు సైకిల్ ర్యాలీకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పెట్ల నాయుడు, జానకి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు పి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మాదక ద్రవ్యాల వినియోగంపై చేస్తున్న పోరాటంలో విద్యే శక్తివంతమైన ఆయుధమని నక్కపల్లి రూరల్ సర్కిల్ సీఐ రామకృష్ణ అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు సాగుతున్న సైకిల్ ర్యాలీ బుధవారం అడ్డరోడ్డుకు చేరింది. రెండో రోజు గురువారం ఈ ర్యాలీని సీఐ రామకృష్ణ అడ్డరోడ్డు జంక్షన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సైకిల్ ర్యాలీ అడ్డరోడ్డు నుంచి కోటవురట్ల గ్రామాల మీదుగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విభీషణరావు తదితరులు పాల్గొన్నారు.

కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబాబుకి సత్కారం



పెదిరెడ్డి చిట్టిబాబుని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ నేత పెదిరెడ్డి చిట్టిబాబుని గురువారం పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెదిరెడ్డి చిట్టిబాబుని టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాల బాబు, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గొర్రెల రాజబాబు, టీడీపీ నాయకులు పెదిరెడ్డి శ్రీను, మజ్జూరి నారాయణరావు, చింతకాయల రాంబాబు, మలిపెద్ది వెంకటరమణ, మల్లవరపు రమాకుమారి తదితరులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూరెడ్డి ప్రసాద్, గొల్లపల్లి నాగు, ముంజులూరి దుర్గాప్రసాద్, తాటిపాక లోవరాజు, సీహెచ్.పేర్రాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కాకినాడ జిల్లా తునిలో జరిగిన అభినందన కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబుని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియంకేరి, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల దత్తతకు ప్రణాళికలు

నక్కపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి, వారిని అన్ని విధాలా ఆదుకోవడానికి నిరంతరం కృషి చేస్తున్నామని జిల్లా బాలల సంరక్షణా అధికారిణి పెయ్యల లక్ష్మి చెప్పారు. గురువారం స్థానిక లవ్ ఇన్ యాక్షన్ చిల్డ్రన్ హోమ్‌లో జాతీయ దత్తత అవగాహనా మసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల అధికారిక దత్తత ప్రక్రియకు ప్రణాళికలు రూపొందించామన్నారు. బాలల హక్కులు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జీసీఎం సంస్థ వ్యవస్థాపకుడు గెద్దాడ ప్రవీణ్ రత్నకుమార్ చేస్తున్న కృషిని ఆమె ప్రశంసించారు. శిశు సంరక్షణాధికారిణి ఎస్.రంజిత బాడ్ టచ్, గుడ్ టచ్ గురించి వివరించారు. పోక్సో యాక్ట్‌పై అవగాహన కల్పించారు.

ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష కరపత్రాల ఆవిష్కరణ

మునగపాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న ఎన్ఎంఎంఎస్-2025 నమూనా పరీక్ష ప్రచార కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధిస్తే నాలుగేళ్లు ఉపకార వేతనం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెంటకోట సత్యనారాయణ, ఆడారి జనార్దన్, సంస్థ ప్రతినిధులు ఎస్.తమ్మిరాజు, కేవీ రమణ పాల్గొన్నారు.

నేడు 'ఇది అతని సంతకం' నాటిక ప్రదర్శన

మునగపాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందీశ్వర ప్రాంగణంలోని తులసీ కళా వేదికపై ఈ నెల 14వ తేదీన 'ఇది అతని సంతకం' నాటిక ప్రదర్శన జరగనుందని వెలగా వీరునాయుడు మెమోరియల్ ఆర్ట్స్ ప్రతినిధి వెలగా శ్రీనివాసరావు తెలిపారు. నాటిక ప్రదర్శనతో పాటు ప్రభుత్వ స్కూల్ ఉపాధ్యాయుడు కొణతాల సోమశేఖర్‌కు అవార్డు ప్రదానం చేస్తామన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

అచ్యుతాపురం/ఎలమంచిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని అచ్యుతాపురం, ఎలమంచిలి గ్రంథాలయాధికారులు బి.కోటేశ్వరరావు, ఆనంద్ తెలిపారు. తొలి రోజు నెహ్రూ జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, తదితర వివిధ పోటీలు నిర్వహిస్తామని, 20న ముగింపు రోజున బహుమతి ప్రదానం ఉంటుందని ఆయన తెలిపారు.

నేడు టీడీపీ ప్రజాదర్బార్

ఎలమంచిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమస్యలు, ప్రజల సమస్యల పరిష్కారానికి స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు గొర్లె నానాజీ, యిత్తంశెట్టి సన్యాసినాయుడు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు హాజరవుతున్నారని తెలిపారు. అన్ని గ్రామాలకు చెందిన కార్యకర్తలు సమస్యలను వినతిపత్రాల ద్వారా తెలియపరచాలన్నారు.

పలు గ్రామాల్లో ఎంపీడీవో పర్యటన



దేవవరంలో సంపద కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో చైతన్య

నక్కపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవవరం, గొడిచెర్ల, ఉద్దండపురం, వేంపాడు గ్రామాల్లో గురువారం ఎంపీడీవో బీ చైతన్య పర్యటించారు. సచివాలయాలను తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో శానిటేషన్ పనులు ఎలా జరుగుతున్నాయో ఆరా తీశారు. సంపద కేంద్రాలను తనిఖీ చేశారు.సేంద్రియ ఎరువుల ఉత్పత్తులను పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉద్దండపురం సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్, దేవవరం సర్పంచ్ రాఘవకుమారి, గొర్ల నర్సింహమూర్తి పాల్గొన్నారు.

భయం..భయంగా విధులు

▸▸ శిథిలావస్థలో అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్ భవనం ▸▸ శ్లాబ్ నుంచి ఊడి పడుతున్న పెచ్చులు

▸▸ వర్షపు నీరు చేరుతుండడంతో రికార్డులు భద్రపర్చుకునేందుకు అవస్థలు ▸▸ ఉన్నతాధికారులు స్పందించాలని అంతా వేడుకోలు



అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ భవనం





శిథిలావస్థకు చేరిన భవనంలో సిబ్బంది విధులు (అంతర్ చిత్రం) పెచ్చులూడిన శ్లాబ్



భవనంలో బీటలు వారిని గోడలు

కొత్తూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి రూరల్ పోలీసులను స్టేషన్ భవనం భయపెడుతోంది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో శ్లాబ్ నుంచి ఎక్కడికక్కడ పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో ఇటు సిబ్బంది, అటు ఫిర్యాదులు చేసేందుకు వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విధి నిర్వహణలో ఉండగా ఎప్పుడు ఏ పెచ్చు మీద పడుతుందోనని హడలిపోతున్నారు. సుమారు మూడు దశాబ్దాల క్రితం ఈ భవనాన్ని నిర్మించారు. నిర్వహణను పట్టించుకునేవారు లేకపోవడంతో ప్రస్తుతం దారుణంగా తయారైంది. శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతుండడంతో వర్షం వస్తే నీరు లీకేజీల కారణంగా భవనంలోకి చేరుతోంది. దీంతో రికార్డులు భద్రపర్చుకునేందుకు అవస్థలు పడుతున్నారు. అసలే ఇరుకు గదులు, ఆపై ఇటువంటి సమస్యలతో సతమతం అవుతున్నారు. సుమారు 32 పంచాయతీలు ఈ స్టేషన్ పరిధిలో ఉండడంతో నిత్యం తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదులు చేసేందుకు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారు సైతం భవనం దుస్థితిని చూసి ఆందోళన చెందుతున్నారు. ఇదిలావుంటే, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను భద్రపరిచేందుకు పోలీసు స్టేషన్‌లో అనువైన స్థలం కరువైంది. దీంతో భవనం వెనుక వైపు లేదా స్టేషన్ పక్కన వాటిని ఉంచుతున్నారు. జిల్లా కేంద్రంలో ఉన్నప్పటికీ ఈ స్టేషన్ దుస్థితిని పట్టించుకునేవారు కరువయ్యారు. ఇదిలావుంటే, ప్రధాన రహదారిని ఆనుకొని స్టేషన్ భవనం ఉండడంతో ధ్వని, వాయి కాలుష్యానికి సిబ్బంది గురవుతున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు విశాలమైన స్థలంతో నూతన భవనాన్ని నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

▸▸ పోలీసు అధికారుల నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ తుహిన్‌సిన్హా



నెలవారీ నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నేరాల నియంత్రణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. గురువారం ఇక్కడి పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో గత నెలలో నమోదైన కేసుల దర్యాప్తుతో పాటు నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసు నమోదు నుంచి చార్జ్‌షీటు దాఖలు చేసే వరకు అధికారులు సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా సేకరించి దర్యాప్తును పక్కాగా చేపట్టాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తో సమన్వయం కొనసాగిస్తూ కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎన్‌డీ పీఎస్ కేసుల విషయంలో దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం విధుల్లో ప్రతిభకనబరిచిన అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు, డీఎస్పీలు విష్ణుస్వరూప్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత

▸▸ ఇదే లక్ష్యంతో ముందుకు సాగాలి

▸▸ చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టిసారించాలి

▸▸ ఉపాధ్యాయుల సమావేశంలో డీఈవో అప్పారావునాయుడు



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

సబ్బవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం కావాలని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు ఆరో తేదీ నుంచి పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల భద్రత, పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత, బోధనా సామర్థ్యం పెంపు, నైతిక విలువలు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన



అల్పాహారం తీసుకుంటున్న సురేంద్ర, జడ్పీ

అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తితో కలిసి గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర గురువారం పరిశీలించారు. ఉదయం ఏడు గంటలకు వెళ్లి అల్పాహారం తింటున్న వారిని రుచులు అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో సేవల తీరుపై ఆరా తీశారు. అనంతరం వారు కూడా అల్పాహారం స్వీకరించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా : జడ్పీ చక్రవర్తి



స్టేషన్‌రోడ్డులో దుకాణాల ముందు వ్యాపారులతో మాట్లాడుతున్న జడ్పీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యాపారి తమ దుకాణం ముందు డస్ట్ బిన్‌లను విధిగా ఏర్పాటు చేసుకొని, వాటిలో వేసిన చెత్తను వాహనాలకు అందించాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వాహణ పనులను ఆయన పరిశీలించారు. స్టేషన్ రోడ్డులోని ఒక దుకాణం ముందు వ్యాపారి ఏర్పాటు చేసిన నీలం, ఆకుపచ్చ రంగు డస్ట్‌బిన్‌లను పరిశీలించి అభినందించారు. ప్రతి ఒక్కరూ ఇదే తరహాలో డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నీలం రంగు డస్ట్‌బిన్‌లో తడి చెత్త, ఆకుపచ్చ డస్ట్‌బిన్‌లో పొడి చెత్త వేసి వాహనాలకు అందజేయాలన్నారు. అలా చేయకుండా రోడ్లపై చెత్తను వేస్తే జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. ఈయన వెంట శానిటేషన్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

16న పంచారామాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం

అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : కార్తీక మాసం ఆఖరి సోమవారం పంచారామాల క్షేత్రాలను దర్శించుకునేందుకు ఈ నెల 16వ తేదీన ప్రత్యేక బస్సు సర్వీసును భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ గౌరీ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ఈ బస్సు అనకాపల్లి కాంప్లెక్స్ నుంచి బయలుదేరి సోమవారం అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారా మం, సామర్లకోట క్షేత్రాల్లో దర్శనాలు చేయించనున్నట్టు చెప్పారు. అల్ట్రా డీలక్స్ బస్సు అందుబాటు లోకి తీసుకువస్తున్నామని, ఒక్కొక్కరికి రూ. 1750 చొప్పున టికెట్ చార్జీగా నిర్ణయించినట్టు చెప్పారు. కార్తీకమాసంలో ఏ ఇతర రోజైన గ్రూపుగా వస్తే ప్రత్యేక బస్సులు సమకూర్చుతామన్నారు. అలాగే అయ్యప్ప స్వామి భక్తులు శబరిమలై వెళ్లడానికి, పిక్నిక్‌లకు వెళ్లేందుకు స్పెషల్ బస్సులు ఏర్పాటు చేస్తామని వివరించారు.

పూరిపాక దగ్ధం

సబ్బవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాయపుర అగ్రహారంలో గురువారం నంబారు అప్పారావుకు చెందిన పూరిపాక ప్రమాదవశాత్తు దగ్ధమైంది. తహసీల్దార్ బి.చిన్నికృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి నిత్యావసర సరకులు అందజేశారు. సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు, ఆర్‌ఐ వీరయ్య, వీఆర్వో కామరాజు, సర్వేయర్ లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ అఖిల భారత మహా సభల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : విశాఖనగరంలో డిసెంబరు 31 నుంచి జనవరి నాల్గో తేదీ వరకు జరగనున్న సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీవీ శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటానికి ఈ సభల్లో తీర్మానం చేయనున్నట్టు చెప్పారు. అన్నివర్గాల ప్రజలు పాల్గొనాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో గనిశెట్టి సత్యనారాయణ, ఆర్.రాము, జి.వరలక్ష్మి, గంటా శ్రీరామ్, జి.నాయనబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా విద్యాహోమం



హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

లంకెలపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి లంకెలపాలెం మారుతి కూడలిలో కొలువుదీరిన అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహా విద్యాహోమంతో పాటు మహా సౌరహోమాన్ని జరిపించారు. కమిటీ ప్రతినిధులు శ్రీనివాసరావు, రమణమూర్తి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నాలను విజయవంతం చేయాలి

▸▸ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు



సమావేశంలో మాట్లాడుతున్న నాగశేషు

అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలపై ఈ నెల 14న సచివాలయాల వద్ద, డిసెంబరు 12న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు కోరారు. గురువారం స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో నిర్వహిం చిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని, ఐదేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ చేపట్టే ఆందోళనను విజయవంతం చేయాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంచే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని, అదనపు పనులు అప్పగించకూడదని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ పనులతో పనిభారం విపరీతంగా పెరిగిందని, కేంద్రాల్లో పిల్లలకు పాఠాలు చెప్పడానికి సమయం ఉండడం లేదన్నారు. కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం. దుర్గారాణి, కోశాధికారి వీవీ రమణమ్మ, మహాలక్ష్మి, వర లక్ష్మి, సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

‘టీడీపీలో కష్టపడేవారికి గుర్తింపు’



పార్టీ సబ్బవరం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ముత్యాలనాయుడుని అభినందిస్తున్న రాజబాబు, బాబ్జీ

సబ్బవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో కష్టపడేవారికి గుర్తింపు ఉంటుందని పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కోరాడ రాజబాబు అన్నారు. గురువారం ఇక్కడి ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో పెందుర్తి, పరవాడ, సబ్బవరం మండలాల్లో నూతనంగా నియామకమైన మండల, గ్రామ కమిటీల కార్యవర్గాలు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ ఆధ్వ ర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజబాబు ముందుగా దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలని సూచించారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు గండి బాబ్జీ మాట్లాడుతూ పదవులు రాలేదని సీనియర్లు నిరుత్సాహ పడవద్ద న్నారు. కూటమి వలన అధిష్ఠానం అందరికీ న్యాయం చేయ లేకపోతోందన్నారు. సీనియారిటీ ఆధారంగా న్యాయం జరుగుతున్నట్టు చెప్పారు. సమన్వ యంతో పని చేసి ప్రజలకు చేరువుగా ఉంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు గెలుపు తేలికగా పేర్కొన్నారు. విశాఖకు భారీగా పెట్టుబడులు రానున్న నేపథ్యంలో వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలకు ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ క్రమశిక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పని చేయాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకుడు గండి వంశీదీప్, గండి దేముడు, బొండా సత్యారావు, కొటాన అప్పారావు, పైల జగన్నాథరావు, పల్లా తాతారావు, రెడ్డి నారాయణరావు, ఆడారి నాగరాజు, పడాల శ్రీను, ఎల్లాజీ, ఆకుల గణేష్, రామ్మ ష్ణరాజు, ఎ.నరసింగరావు, రొంగలి దేముడు, బలిరెడ్డి అప్పారావు, రామకృష్ణరాజు, జి సూర్యనారాయణ, మూడు మండలాల నేతలు, కార్యకర్తలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

‘కర్మయోగం విశిష్టత ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి’



సబ్బవరంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

సబ్బవరం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : కర్మయోగం విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు పిలుపునిచ్చారు. సబ్బవరంలో గురువారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన ఇంటింటికీ వెళ్లి భగవద్గీత విశిష్టితను వివరించి, పుస్తకాలను పంపిణీ చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి.కృష్ణ, సూరప్పడు, కె.పోలి నాయుడు, బి.పైడన్న, వి.భవానీ, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

కొణతాల కుమార్తె వివాహానికి మంత్రి లోకేశ్



వధూవరులతో మంత్రి లోకేశ్, చిత్రంలో ఎమ్మెల్యే కొణతాల

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కుమార్తె లక్ష్మీరమ్య, అనంతబాబుల వివాహం గురువారం ఘనంగా జరిగింది. విజయనగరం జిల్లా భోగాపురం మండలం సవరవిల్లి సమీపంలోని సన్‌రే రిసార్ట్స్‌లో జరిగిన వివాహ మహోత్సవానికి మంత్రులు నారా లోకేశ్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

యలహంక స్పెషల్‌కు విశేష స్పందన

▸▸ పుట్టపర్తికి భారీగా బయలుదేరిన భక్తులు



రైలులో పుట్టపర్తికి బయలుదేరిన ఏజెన్సీ వాసులు

అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలో సత్యసాయిబాబా శత జయంతి వేడుకల సందర్భంగా రైల్వేశాఖ భక్తుల సౌకర్యార్థం అనకాపల్లి నుంచి యలహంకకు ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలుకు విశేష స్పందన లభించింది. ప్రత్యేక రైలు విషయం ముందుగానే తెలియడంతో అనకాపల్లితో పాటు పాడేరు, అరకు నియోజకవర్గాల భక్తులు ముందుగానే రిజర్వేషన్ చేయించుకున్నారు. అంతేకాకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కూడా ఈ రైలులో ప్రయాణం సాగించారు. 23 బోగీలతో ఈ రైలు అనకాపల్లి నుంచి గురువారం సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరింది. ఎలమంచిలి, తుని, సామర్లకోట జంక్షన్, రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ జంక్షన్, గుంటూరు జంక్షన్, నరసారావుపేట, వినుకొండ, దొనకొండ, మార్కాపూర్‌రోడ్డు, కుంభం,



నంద్యాల, డోన్ జంక్షన్, గూటీ, అనంతపూర్, ధర్మవరం జంక్షన్, సాయి ప్రశాంతి నిలయం స్టేషన్ల మీదుగా యలహంక జంక్షన్‌కు శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలులో అధిక శాతం ప్రయాణికులు పుట్టపర్తికి వెళ్లే భక్తులు ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు ప్రశాంతి నిలయంలో జరిగే వేడుకల్లో సేవ చేయడానికి బయలుదేరారు. గురువారం మధ్యాహ్నానికే అనకాపల్లికి చేరుకోవడంతో సత్యసాయి సేవా సమితి జిల్లా ప్రతినిధులు వారందరికీ భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన



గొలుగొండలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న జీఎస్‌యూ నేతలు, గిరిజనులు

పెదబయలు, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంతుర్ల పంచాయతీ పరిధి రాసగుప్ప-గొలుగండ ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని జీఎస్‌యూ నేతలు డిమాండ్ చేశారు. గురువారం పలు గ్రామాలను సందర్శించారు. గొలుగొండలో గ్రామస్థులు రోడ్డు సమస్యను వివరించారు. సుమారు పదేళ్ల కిందట నిర్మించిన ఈ బీటీ రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైందని పేర్కొన్నారు. దీంతో 5 గ్రామాల గిరిజనులు రవాణాకు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈ కార్యక్రమం లో జీఎస్‌యూ నాయకులు మణుగూరి బాబూజీ, గిరిజనులు పాల్గొన్నారు.

'వనభంగిని పెదబయలు మండలంలోనే కొనసాగించాలి'



పీవో తిరుమణి శ్రీ పూజకు వినతి పత్రం అందిస్తున్న పంచాయతీ ప్రజలు

పెదబయలు, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): వనభంగి పంచాయితీని పెదబయ లు మండలంలోనే కొనసాగించాలని వనభంగి పంచాయితీ గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పాడేరు ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు పంచాయతీలకు కేంద్ర బిందువుగా ఉన్న గోమంగిని ప్రత్యేక మండలంగా ప్రకటిం చటం తమకు సమ్మతమేనని తెలిపారు. కానీ నూతనంగా ఏర్పడనున్న గోమంగి పంచాయతీలో వనభంగిని విలీనం చేయటం సమంజసం కాదని పేర్కొన్నారు. వనభంగి పంచాయితీ సర్పంచ్ కొర్ర కాసులమ్మ, ఉప సర్పంచ్ బా బూరావు, వార్డు మెంబర్ చలపతి,కూటమి నాయకులు,13 గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై సమావేశం



మాట్లాడుతున్న అధికారి రాజశేఖర్

సీలేరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు బాలుర గురుకుల పాఠశాలలో గురువారం బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల హక్కుల పరిరక్షణ విభాగం ప్రొటక్షన్ అధికారి కె. రాజశేఖర్ బాల్య వివాహాలు, పిల్లలపై లైగింక వేధింపులు, నిరోధం, మానవ అక్రమ రవాణా నియంత్రణ, , మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో లీగల్ అధికారి ఎస్ అశోక్‌కుమార్, , ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యపై విచారణ

అనంతగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలోని సచివాలయాన్ని తహసీల్దార్ వీర భద్రచారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుల, ఆదాయ, లేటు, బర్త్, డెత్, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ల కోసం గిరిజనులు నుంచి దరఖాస్తులను స్వీకరించి, త్వరితగతిన రెవిన్యూశాఖకు పంపిస్తే వెంటవెంటనే ధ్రుపత్రాలు జారీ చేస్తామని సిబ్బంది సూచించారు. అనంతరం ఎన్ఆర్‌పురం పంచాయతీ బొంగిజ గ్రామానికి వెళ్లి, కోనేపు పైడమ్మ అనే గిరిజన మహిళ, పాడేరు స్పందనలో భూ సమస్యపై ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. బొంగిజకు అతికష్టంగా చేరుకుని అక్కడి గిరిజనులతో మమేకమయ్యారు. సమస్యలను పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రాంబాబు, తదితరులు ఉన్నారు.

కాఫీ కార్మికుల సమ్మె

పాడేరురూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాఫీ ఎస్టేట్‌లో కార్మికులు, హెల్పర్ల సమస్యలు పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 8వ రోజుకు చేరింది. గురువారం మినుములూరు కాఫీ ఎస్టేట్ డివిజనల్ మేనేజర్ కార్యాలయంఎదుట కార్మికులు వం టా-వార్పు చేపట్టి నిరసన తెలిపారు. ఈ శిబిరాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కాఫీ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు లింగేరి సుందరరావు, కాఫీ హెల్పర్లు, కార్మికులుకె.కాంతమ్మ, సత్యనారాయణ, కన్ననాథ్, వసంత అప్పలమ్మ లత పాల్గొన్నారు.

చింతపల్లి: కాఫీ కార్మికులు వంట వార్పుతో నిరసన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక రహదారిపైనే వంట చేసుకుని భోజనాలు చేసి ఏపీఎఫ్‌డీసీ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ ఏపీఎఫ్‌డీసీ అధికారులు స్పందించి కార్మికులతో చర్చలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పదవులు పొందినవారంతా... కష్టపడి పనిచేయాలి

» టీడీపీ అరకు అసంబ్లీ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు శివరామకృష్ణ



మండల పార్టీ కార్యవర్గంను సన్మానిస్తున్న దొన్నుదొర, శివరామకృష్ణ

అరకులోయ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నుంచి వివిధ పదవులను పొందిన నేతలంతా శక్తివంచన లేకుండా పనిచేసి పార్టీకి పూర్వవైభవం తేవాలని అరకు అసంబ్లీ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు శివరామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం అరకులోయ వాలీబాల్ గ్రౌండ్‌లో టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అధ్యక్షతన వివిధ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశీలకుడు శివరామకృష్ణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, పార్టీలో బూత్ కమిటీలనుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి వరకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఇన్‌చార్జి దొన్నుదొర మాట్లాడుతూ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి, విద్యా, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ కష్టపడే వారిని ప్రత్యేకంగా గుర్తించి వారి సేవలను పార్టీకి ఉపయోగించుకుంటున్నారు. ఈ మేరకు వివిధ కమిటీల పదవులకు ఎంపిక చేసినట్టు వివరించారు. వీరంతా గ్రామస్థాయిలో ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఇంటింటా ప్రచారం నిర్వహించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మద్దతుదారులు విజయకేతనం వేసేలా కృషి చేయాలన్నారు. క్లస్టరు, యూనిట్, బూత్ కమిటీల ప్రతినిధులు, మండల పార్టీ కార్యవర్గం, మహిళా కమిటీ,తెలుగుయువత కమిటీలకు శక్తి వంచన లేకుండా పాటుపడాలన్నారు. ఇంతవరకు పెండింగ్‌లో ఉన్న అనంతగిరి మండల కమిటీని ప్రకటించి వారితో ప్రమాణం చేయించారు. ఇతర మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు ప్రమాణం చేయించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు సర్పంచ్, సీనియర్ నాయకుడు పెట్టెలిదాసు బాబు, మండల పార్టీ అధ్యక్షుడు లకోయ్ మహదేవ్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు, శెట్టి లక్ష్మణుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ బొరిబొరి లక్ష్మి, తెలుగు మహిళా నేత సూర్యకాంతం, బుర్జలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి: డీపీవో



ఎగువశోభలో పర్యటించిన డీపీవోచంద్రశేఖర్, డీఎల్‌పీవో, సర్పంచ్

అనంతగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టిసారించాలని డీపీవో చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని ఎగువశోభ పంచాయతీ కేంద్రంలోని డివిజనల్ పంచాయతీ అధికారి పి ఎస్.కుమార్‌తో కలిసి గురువారం పర్యటించారు. పారిశుధ్య పనులు, ఇళ్ల పన్ను వసూలుపై ఆరా తీశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం లో కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బందితో ప్రత్యేక సమావేశమయ్యారు. డీపీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పారిశుధ్యం కోసం ప్ర భు త్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ ఫోన్‌కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇళ్ల పన్నులు వసూలుపై నిర్లక్ష్యం వద్దన్నారు.

భాషా వలంటీర్‌తో బోధన ఎన్నాళ్లు?



చీడివలస పాఠశాలను సందర్శించి విద్యార్థి సంఘం నాయకులు

అనంతగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంగుపర్తి పంచాయతీ చీడివలసలోని జీపీఎస్ టీడబ్ల్యూ పాఠశాల భాషా వలంటీర్ ద్వారా నడుస్తోందని గిరిజన విద్యార్థి సంఘం బి.మాధవరావు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, రెండేళ్ల కిందట ఉన్నత చదువు నిమిత్తం ఈ పాఠశాలలోని ఉపాధ్యాయుడు వెళ్లగా.. అప్పటినుంచి వలంటీర్‌తోనే నెట్టుకొస్తున్నారన్నారు. ఈ పాఠశాలలో 38 మంది విద్యార్థులకు ఉండగా. మరొక ఉపాధ్యాయుడిని నియమించకపోవడంతో చిన్నారులకు సక్రమంగా విద్యా బోధన అందడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఉపాధ్యాయుడు నియమించి విద్యాప్రమాణాలను మెరుగుపరచాలని, కోరారు. ఈ కార్యక్రమంలోని విద్యార్థి సంఘం నాయకులు చంటి, బాబుజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

పుట్టపర్తికి సత్యసాయి భక్తులు పయనం



అరకు రైల్వేస్టేషన్ నుంచి భక్తులతో బయలుదేరుతున్న రైలు

అరకులోయ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అరకులోయ నుంచి పుట్టపర్తికి ప్రత్యేక రైలు గురువారం మధ్యాహ్నం 12కు బయలుదేరి వెళ్లింది. ఈ రైలులో పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు సత్యసాయి గిరిజన భక్తులు ఈ ప్రాంతం నుంచి 800 మంది వెళ్లారు. పుటపర్తిలో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు ది గనున్నారు. 21 కంపార్టుమెంట్లలో ఈ ట్రైన్ అరకు రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరింది. ఇదే ట్రైన్ కర్ణాటక రాష్ట్రం యల్హంక నుంచి 17, 24 తేదీలలో అరకుకు రానుంది. వెంటనే తిరిగి ప్రయాణమవుతుంది. ఈ ప్రత్యేక రైలుకు రైల్వేశాఖ సిబ్బంది, భక్తులు మామిడి, అరటి తోరణాలతో ముస్తాబుచేశారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు సత్యసాయిట్రస్ట్ ప్రతినిధులు ప్రత్యేకంగా మన్యప్రాంతం నుంచి భక్తులు తీసుకువెళ్తున్నారు. దువ్వాడ స్టేషన్ నుంచి మరో 200 మంది సత్యసాయి భక్తులు ఈ రైలులో వెళ్లనున్నట్లు ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా అరకులోయ సీఐ హిమగిరి, ఎస్ఐ గోపాలరావు, అరకు రైల్వే ఎస్ఐశ్యామలరావు, సిబ్బంది ప్రయాణికులకు పలు జాగ్రత్తలు సూచించారు.

ఇద్దరి వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వోకృష్ణమూర్తినాయక్

జి.మాడుగుల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పదని డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణమూర్తినాయక్ హెచ్చరించారు. స్థానిక, గెమ్మెలి పీహెచ్‌సీలలో ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. జి.మాడుగుల పీహెచ్‌సీలో విధులకు గైర్హాజరైన వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రోగులకు వైద్య సేవలపై ఆయన అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ద్వారా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం గెమ్మెలి పీహెచ్‌సీలో తనిఖీలు చేశారు. జి.మాడుగుల పీహెచ్‌సీలో గైర్హాజరైన ఇద్దరి సిబ్బందిపై షొకాజ్ నోటీసులు జారీ చేసి ఒక్క రోజు జీతం నిలిపి వేసినట్లు డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు. ఆయన వెంట వైద్యాధికారులు ఉన్నారు.

గంజాయి నష్టాలపై అవగాహన



జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించిన ఈగల్ బృందం

పాడేరురూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈగల్ టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గంజాయి, డ్రగ్స్ దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమేశ్ రుద్ర మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ తో నష్టాలను వివరించారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్, ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ ఈగల్ , మాదక ద్రవ్యాల నిరోధక చట్టాలు, శిక్షలు, పోక్సో చట్టం, బాల్య వివాహాల చట్టం, సైబర్ నేరాల బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పోస్టర్లు ఆవిష్కరించారు. గంజాయి, డ్రగ్స్ సమాచారం తెలిస్తే 1972 టోల్ ఫ్రీకి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీపీఎస్ సీఐ రవికుమార్, జిల్లా సోషల్ మీడియా సీఐ పి.వెంకట రమణ, కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ సీహెచ్.రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ శాఖ వనసమారాధన



వనసమారాధనలో అటవీశాఖ ఉద్యోగులు

చింతపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం ఎకో టూరిజం ప్రాజెక్టులో చింతపల్లి రేంజ్ అటవీశాఖ ఉద్యోగులు గురువారం కార్తీక వనసమారాధన జరిపారు. రేంజ్ పరిధి ఉద్యోగులు ఉత్సాహంగా..ఉల్లాసంగా గడిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో రేంజ్ అధికారి బి. అప్పారావు, డీఆర్‌వో వెంకటరావు, క్షేత్ర స్థాయి ఉద్యోగులు పాల్గొన్నారు.

బిర్సాముండా సేవలు చిరస్మరణీయం

చింతపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన బిర్సాముండా సేవలు చిరస్మరణీయమని గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. గురువారం బిర్సాముండా జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన చిత్ర పటానికి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో మదర్ కళాశాల ప్రిన్సిపాల్ సాగిన నాగార్జున, గిరిజన సంఘం నేత పాంగి ధనుంజయ్ పాల్గొన్నారు.

వైద్యులను దుర్భాషలాడిన వ్యక్తిపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న తమను దుర్భాషలాడిన వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) వైద్యులు, వైద్య సిబ్బంది గురువారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ గీతాంజలి మాట్లాడుతూ, ఈ నెల 12వ తేదీ సాయంత్రం అనారోగ్యంతో ఉన్న ఓ వ్యక్తిని సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అతనికి వైద్యులు సేవలు అందించారు. సా యంత్రం కావడంతో అతనికి ల్యాబ్ టెస్టులు జరగలేదు. దీంతో రోగిని వార్డులో చేర్చుకుని మరుసటి రోజు ఉదయం వార్డులో రౌండ్స్ సమయంలో ల్యాబ్ టెస్టులు చేయించమని సూచించగా, రోగితో వచ్చిన జగత్‌రాయ్ అనే వ్యక్తి తమపైకి దాడి చేసేందుకు ప్రయత్నించి, దుర్భాషలాడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడడంతో సీహెచ్‌సీ ఆవరణలో పోలీస్ భద్రత ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. ఆమె వెంట సీహెచ్‌సీ వైద్యులు వివేక్, ధరణి, సిబ్బంది పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో కాకరపాడు కళాశాల విద్యార్థుల ప్రతిభ

కొయ్యూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ (కుస్తీ) పోటీల్లో కాకరపాడు గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి రెండు బంగారు, మూడు రజత పతకాలు కైవసం చేసుకున్నారు. గత నెల 28న విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో కళాశాల లో కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సీహెచ్ కార్తీక్, జి. దుర్గాప్రసాద్ పాల్గొని బంగారు పతకాలు కైవసం చేసుకోగా, బి. చంద్రశేఖర్, కె. జయరాం, కె. రామదాసులు రజత పతకాలు సాధించారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ కె. లక్ష్మణుడు ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ అచ్చన్న తదితరులు విద్యార్థులను అభినందించారు. పీడీ ఉదయ్‌ను ఘనంగా సత్కరించారు.



కుస్తీ పోటీలో పతకాలు సాధించిన కాకరపాడు విద్యార్థులతో ప్రిన్సిపాల్ సిబ్బంది

ఏయూ పరిధిలో డిగ్రీ విద్యార్థులు సత్తా

చింతపల్లి: ఏయూ పరిధి ఇంటర్ కాలేజీ క్రీడల్లో స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు వాలీబాల్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి తెలిపారు. గురువారం క్రీడాకారులతో విద్యార్థులు, అధ్యాపకులు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ఇటీవల ఏయూ మైదానంలో క్రీడా పోటీల్లో వాలీబాల్‌లో ఉత్తమ ప్రతిభ చూపి బీకాం విద్యార్థి వసంత కుమార్ కేరళలో జరిగే సౌత్ జోన్ క్రీడల్లో ఏయూ నుంచి పాల్గొనేందుకు ఎంపికయ్యారన్నారు. ఈ విద్యార్థులు, పీడీ కిముడు శివరామ్ కుమార్‌ని అభినందించారు.



చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం

జి.మాడుగుల : శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన స్థానిక బాలురు ఆశ్రమ పాఠశాల-1లో 9వ తరగతి చదువుతున్న పాంగి రాజేశ్ లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, డిస్కస్ త్రోలో ద్వితీయ స్థానం సాధించినట్లు హెచ్ఎం ఎం.బాలరాజు తెలిపారు. ఈ మేరకు విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికనట్టు పేర్కొన్నారు. ఈ క్రీడాకారుడిని గురువారం ఏటీడబ్ల్యూవో వి.శిరిషా, పీడీ సత్యనారాయణతోపాటు సిబ్బంది అభినందించారు.



కీడాకారుడు రాజేశ్‌తో ఏటీడబ్ల్యూవో, హెచ్ఎం

జాజులబంధలో పాఠశాల ఏర్పాటుపై హర్షాతిరేకాలు



పాఠశాల మంజూరు పత్రాన్ని సర్పంచ్‌కు అందచేస్తున్న డీఈవో బ్రహ్మాజీ

కొయ్యూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మూలపేట పంచాయతీ జాజులబంధ గ్రామంలో నూతనంగా పాఠశాలను నెలకొల్పారు. గురవారం డీఈవో బ్రహ్మాజీరావు స్వయంగా గ్రామానికి వెళ్లి పాఠశాల ఏర్పాటుకు మంజూరైన అనుమతి పత్రాన్ని సర్పంచ్ వెంకట లక్ష్మికి అంద చేసి పాఠశాలను ప్రారంభించారు. సుదీర్ఘ పోరాటాల అనంతరం ప్రభుత్వం తమ గ్రామానికి పాఠశాల ప్రారంభించేందుకు వచ్చిన అధికారులు, ప్రజా ప్రతినిధులకు గ్రామస్థులు, విద్యార్థులు ఘనంగా సత్కరించి థింసా నృత్యాలతో ఆహ్వానం పలికారు. ఈ గ్రామంలో ఉన్న కొందు తెగకు చెందిన బడి ఈడు పిల్లలకు 2023లో గ్రామస్థులు షెడ్డు నిర్మించారు. అనంతరం మాతృభూమి అనే స్వచ్ఛంద సంస్థ రూ 1.35 లక్షలతో విద్యా సామగ్రి, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఇన్ని ఉన్నా ఉపాధ్యాయుడు లేక గ్రామస్థులు ఆందోళన చేస్తూ వచ్చారు. దీంతో జాతీయ మానవ హక్కుల కమిషన్ కూడా స్పందించింది. తక్షణమే జాజులబంధలో స్కూల్ ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించింది. ఫలితంగా గురువారం డీఈవో స్కూల్స్ కో ఆర్డినేటర్ జె. కూర్మారావు, ఎంఈవో రాంబాబు గ్రామంలో నియమించిన ఉపాధ్యాయుడిని పరిచయం చేశారు. నూతనంగా పాఠశాలకు విద్యాకమిటీ ఏర్పాటు చేసి గ్రామానికి చెందిన మర్రి కామేశ్వరావును చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కోఆర్డినేటర్ కోటి లింగం పడాల్, పంచాయతీ కార్యదర్శి ఎన్ రవీంద్ర, సీపీఎం నేత గోవిందరావు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో ఉపాధి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ మురళీ

అరకులోయ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మన్యం ప్రాంతంలో తేనెటీగల పెంపకంతో యువత ఉపాధి పొందాలని డీఆర్‌డీఏ పీడీ మురళీ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం మండల ఉద్యానవన శాఖ అధికారి కె.శిరీషా ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వెలుగు, డీఆర్‌డీఏ, హంబుల్-బీ స్వచ్ఛందసంస్థ, శాస్త్రవేత్త సన్యాసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మురళి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బాలకర్ణి మాట్లాడుతూ, ప్రస్తుతం వలసిపూల సీజన్ కావడంతో నాణ్యమైన తేనె లభిస్తుందనారు. మిగిలిన రోజులు తేనె సేకరణకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. ఈ తేనెటీగల పెంపకానికి ప్రభుత్వం 40శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. శాస్త్రవేత్త సన్యాసి తేనెటీగల పెంపకం, తేనె తయారీ, విక్రయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

చినలబుడు పాఠశాల సమస్యలు పరిష్కరిస్తాం: డీఈవో



హెచ్ఎం, విద్యా కమిటీ చైర్మన్‌తో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీ

అరకులోయ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చినలబుడు ఎంపీపీ పాఠశాలను డీఈవో బ్రహ్మాజీ ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'చినలబుడు పాఠశాలలో అన్ని సమస్యలే అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసింద. స్పందించిన డీఈవో పాఠశాలకు బుధవారం వచ్చారు. సందర్భంగా పాఠశాలలోని సమస్యలను విద్యాకమిటీ చైర్మన్ నరసింగరావు, హెచ్ఎం దుక్కునాయుడు వివరించారు. ఈ సందర్భంగా రన్నింగ్ వాటర్ లేక ఇబ్బందులు, ఆర్వో ప్లాంట్, టాయ్‌లెట్స్ తదితర వాటిని ఎంఈవో త్రినాధరావుతో కలిసి డీఈవో పరిశీలించారు. శిథిల స్థితిలో ఉన్న రేకులషెడ్‌లను గుర్తించారు. హెచ్ఎం,టీచర్స్ సొంత నిధులతో చేపట్టిన పనులను ఈ సందర్భంగా విద్యాకమిటీ చైర్మన్ ఆయన వివరించారు. తరగతి గదులు, విద్యార్థుల ప్రమాణాలను పరిశీలించారు.

జిల్లాను కుష్ఠు వ్యాధి రహితం చేయాలి: కలెక్టర్

» 17 నుంచి 30 వరకు ఇంటింటా సర్వే



కుష్ఠు వ్యాధి నివారణపై ముద్రించిన పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, డీఎంహెచ్‌వో కృష్ణమూర్తి నాయక్, తదితరులు

పాడేరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అందరి సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టి జిల్లాను కుష్ఠు వ్యాధి రహితం చేయాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సూచించారు. కుష్ఠు వ్యాధి నివారణపై ముంద్రించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు ఇంటింటా సర్వే నిర్వహించి కుష్ఠు వ్యాధి గ్రస్తులను గుర్తించాలన్నారు. ఈ క్రమంలో వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బందికి ఇతర శాఖల అధికారులు, సిబ్బంది సహాయక సహకారాలు అందించాలన్నారు. అందరి సహకారంతో జిల్లాను కుష్ఠు వ్యాధి రహితం చేయాలన్నారు. అందుకు ఆయా శాఖల అధికారులు చేపట్టాల్సిన చర్యలను కలెక్టర్ దినేశ్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ కృష్ణమూర్తినాయక్ మాట్లాడుతూ జిల్లాలో 2022 నుంచి ఇప్పటి వరకు 59 మంది కుష్ఠు వ్యాధి బాధితులను గుర్తించామని, వారిలో 38 మంది పురుషులు, 21 మంది మహిళలున్నారన్నారు. వారికి అవసరమైన చికిత్సలు, వైద్యసహాయం, మందులు అందిస్తున్నామన్నారు. అలాగే ఈ నెల 17 నుంచి చేపట్టే ఇంటింటా సర్వేలో భాగంగా పారామెడికల్ సిబ్బంది జిల్లాలోని 64 పీహెచ్‌సీల పరిధిలోని కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి, వారికి అవసరమైన చికిత్స అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కుష్ఠు, క్షయ, ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.సంజీవపాత్రుడు,పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు



మండల కేంద్రంలో నూతన కార్యవర్గం

అనంతగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల నూతన కార్యవర్గం ఎన్నికతో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండలపార్టీ అధ్యక్షుడు సోవేరి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి గాలి నరసింహమూర్తి (నరేంద్ర) మాట్లాడుతూ.. సమష్టిగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేస్తామన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులతో కలిసి పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.ఆనందరావు, లక్ష్మణ్‌రావు, భీమరాజు, రమేశ్, శ్యామ్, రంజీత్, బాబీ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు ఆశ్రయం కల్పించరాదు: ఎస్ఐ

ముంచంగిపుట్టు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తులకు ఎవరూ ఆశ్రయం కల్పించరాదని స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ అన్నారు. గురువారం ఎస్ఐ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడు నేపథ్యంలో అప్రమత్తమయ్యారు. మండల కేంద్రం మీదుగా ఒడిశా వైపు, అటు నుంచి ఇటుగా వచ్చే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.

మహిళా బాక్సర్లకు స్పీకర్ అయ్యన్న అభినందన


మౌనికను అభినందిస్తున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : ఆంధ్రా యూనివర్సిటీ స్థాయిలో బంగారు పతకాలు సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఇద్దరు బాక్సర్లను స్పీకర్ అయ్యన్నపాత్రుడు గురువారం ఇక్కడ అభినందించారు. స్థానికంగా ఉన్న నింజాస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న బొంతు మౌనిక కళ్యాణం 75 కేజీల విభాగంలో, ఏబీఎం డిగ్రీ కళాశాలలో చదువుతున్న యేడిత లక్ష్మీ తేజస్విని 81 కేజీల విభాగంలో చక్కగా రాణించారు. దీంతో వచ్చే నెలలో పంజాబ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు ప్రకటించడంతో స్పీకర్ వారిని అభినందించారు. ఈప్రాంతానికి మంచి పేరు తీసుకు రావాలని ఆయన ఆకాంక్షించారు.

'చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం'


మహిళలకు నమూనా చెక్కు అందిస్తున్న కౌన్సిలర్ చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : చిరువ్యాపారులకు బ్యాంకుల ద్వారా కూటమి ప్రభుత్వం రుణ సదుపాయం కల్పిస్తున్నట్టు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి తెలిపారు. నర్సీపట్నం మునిసిపాలిటీలో పలువురు చిరువ్యాపారులకు గురువారం రుణాల చెక్కులు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. పెండింగ్‌లో రుణాలు త్వరలో అందిస్తామన్నారు. 91 మంది లబ్ధిదారులకు రూ. 17లక్షల ముప్పైవేల రూపాయలు రుణాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఏడీబీ మేనేజర్ శ్రీనివాస సుబ్రహ్మణ్యం, ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్, ఏపీజీవీబీ మేనేజర్ జయప్రకాష్, పెదబొడ్డేపల్లి టీడీపీ ఇన్‌చార్జి అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి రమణ, తదితరులు పాల్గొన్నారు.

'గ్రామ కంఠంలో ఇళ్లు కట్టుకున్న వారికి ప్రాపర్టీ కార్డులు'

నాతవరం. నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామ కంఠంలో ఇళ్ల స్థలాలు కలిగి ఇళ్లు నిర్మించుకున్న యజమానులకు ప్రాపర్టీ కార్డులు ఇవ్వనున్నామని ఎంపీడీవో ఎం. సత్య శ్రీనివాస్ తెలిపారు. గురువారం నాతవరం పంచాయతీ శివారు ఎ.అగ్రహారంలో స్వామిత్వ గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి అధికారులు సంయుక్తంగా సర్వే చేస్తారన్నారు. ప్రాపర్టీ కార్డు ఉంటే యాజమానులు ఇళ్ల రిజిస్ట్రేషన్‌లు చేసుకోవచ్చునన్నారు. పీఏసీఎస్ ఛైర్మన్ అపిరెడ్డి మాణిక్యం, సర్పంచ్ అప్పలనర్స సీతారామ్మూర్తి, లోవ పాల్గొన్నారు.

కూలిన సూపర్‌పాసేజ్

» 'తాండవ' ఆయకట్టు రైతులకు ఇక్కట్లు

నాతవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గునుపూడి సమీపంలో ఏలేరు కాలువపై ఉన్న సూపర్‌పాసేజ్ కూలిపోవడంతో తాండవ ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సూపర్‌పాసేజ్ ద్వారా యాభై ఎకరాలకు నీరు అందుతుంది. ఏలేరు కాలువ నిర్మాణం జరిగేటప్పుడు ఆ అధికారులు అప్పటికే ఇక్కడ ఉన్న తాండవ కాలువను తొలగించి, ఏలేరు కాలువ మధ్యలో సిమెంట్ దిమ్మలు ఏర్పాటు చేసి వాటిపై సూపర్‌పాసేజ్ నిర్మించి తాండవ ఆయకట్టు భూములకు నీరు అందించేవారు. అయితే బుధవారం సూపర్‌పాసేజ్ కూలిపోవడంతో ఏలేరు కాలువ అవతల ఉన్న 50 ఎకరాల సాగుభూమికి నీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. తాండవ అధికారులు మాత్రం తాత్కాలికం పైపులు ఏర్పాటు చేసి ఏలేరు కాలువ అవతల భూములకు సాగునీరు అందిస్తామని, అయితే ఆనాటి ఒప్పందం ప్రకారం జీవీఎంసీ అధికారులే


గునుపూడి వద్ద ఏలేరు కాలువపై ఉన్న సూపర్‌పాసేజ్ కూలిన దృశ్యం

ఇక్కడ ఏలేరు కాలువపై యథావిధిగా సూపర్‌పాసేజ్‌ను నిర్మించి ఇవ్వాలని తాండవ అధికారులు చెపుతున్నారు. ఇక్కడ జీవీఎంసీ వారే సూపర్‌పాసేజ్ నిర్మించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ద్వారా సదరు అధికారుల దృష్టికి తీసుకెళతానని తాండవ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కరక సత్యనారాయణ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

» జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వీరసూర్యచంద్ర


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యచంద్ర

గొలుగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసైనికులు సిద్ధం కావాలని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. మండలంలోని ధారమఠం శివాలయం వద్ద గురువారం ఏర్పాటైన జనసేన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో పార్టీ పటిష్టతకు అంతా కృషి చేయాలన్నారు. అన్ని పంచాయతీల్లో పోటీకి అభ్యర్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ గొలుగొండ మండల అధ్యక్షుడు గండెం దొరబాబు, నాయకులు రేగుబళ్ల శివ, బోయిన చిరంజీవి, బుంగా రామకృష్ణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'మాకిరెడ్డి' మృతి సీపీఐకి తీరని లోటు

» పార్టీ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

కృష్ణాదేవిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గిరిజన, మైదానప్రాంతాల్లో సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగించిన సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం నర్సీపట్నంలో పురుగుల మందుతాగి రామునాయుడు బలవన్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గురువారం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం అతని మృతదేహాన్ని అప్పగించారు. దీంతో స్వగ్రామమైన గొలుగొండ మండలం చోద్యం సెంటర్ నుంచి వాహనంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా పార్థివదేహాన్ని తీసుకు వెళ్లారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, నాయకులు బాలేపల్లి వెంకటరమణ, పొట్టిక సత్యనారాయణతో పాటు వామపక్షాల నాయకులు కార్యకర్తలు, అభిమానులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు రాధాకృష్ణ, దేముడు, మేకా భాస్కరరావు, అడిగర్ల రాజు, సాపిరెడ్డి నారాయణమూర్తి, ఎల్.గౌరీ, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


రామునాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సత్యనారాయణమూర్తి

ఆకట్టుకున్న పిల్లల వేషధారణలు


కృష్ణుడు, అల్లూరి వేషధారణలతో బాలలు

నర్సీపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పిల్లలకు విచిత్ర వేషధారణ పోటీలను గురువారం ఇక్కడ నిర్వహించారు. శివపురం మోడల్ ప్రైమరీ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. కాళికాదేవి, కృష్ణుడు, అల్లూరి సీతారామరాజు, దుర్యోధనుడు, అయోధ్య రాముడు వంటి వేషధారణలతో పిల్లలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ.నాథ్, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన


పరీక్షా కేంద్రం ఆవరణను పరిశీలిస్తున్న బృందం

నర్సీపట్నం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ ఎ.శ్రీధర్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి సీహెచ్. సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణకు అనువైన వాతావరణం, సౌకర్యాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల ద్వారా పలు అంశాలను తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల్లో డెస్కులు, విద్యుత్, నీటి సౌకర్యం, ఫ్యాన్లు, తాగునీటి వసతి తదితరాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు తలుపులు, నాగేంద్రలతో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే రాజు


మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు

చోడవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖలో భాగస్వామ్య సదస్సుకు హాజరైన మంత్రి నారా లోకేశ్‌కు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ ఎన్ ఎస్ రాజు బుధవారం సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే రాజు, నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పలు ప్రతిపాదనలు మంత్రి లోకేశ్‌కు ఇచ్చారు.

స్థానిక ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యం


సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సూచించారు. మండలంలోని మేడిచర్లలో మాడుగుల, చీడికాడ, కె.కోటపాడు మండలాలకు చెందిన మండలస్థాయి కమిటీలు అనుబంధ గ్రామ కమిటీల సభ్యులచే ప్రమాణ స్వీకారం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో దౌర్జన్యం చేసి అనేకచోట్ల ఏకగ్రీవం చేసుకుందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో అలా జరగరాదన్నారు. అనంతరం మండలంలో ఏడుగురికి రూ. 3. 17లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు ఏసుదాసు, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్, నాయకులు పూడి నారాయణమూర్తి, పూడి శ్రీను, దాడి ఎరుకునాయుడు, డోకల నరసింహమూర్తి, కన్నూరు సూర్యనారాయణ, వెలగల పైడమునాయుడు, భీశెట్టి విజయలక్ష్మి, జూరెడ్డి చిన్నమ్మలు, మూడు మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో ఆలయ నిర్మాణానికి నిధులు

చోడవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కవరంలో మరిడిమాంబ ఆలయానికి దేవదాయశాఖ నిధులు రూ. 10 లక్షలు విడుదలయ్యాయి. గ్రామంలోని ఈ ఆ లయానికి గతంలో దేవాదాయశాఖ రూ.10లక్షలు కేటాయించినా నిధులు మాత్రం విడుదల కాలేదు. ఈ నేపథ్యంలోనే గ్రామ మండల టీడీపీ అధ్యక్షుడు నాగులాపల్లి సూర్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే రాజు దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాజు, అధికారులతో మాట్లాడడంతో, నిధులు ఎట్టకేలకు విడుదలయ్యాయి. ఆలయ నిర్మాణంపూర్తి చేసి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఆలయం ప్రా రంభించడానికి సన్నాహాలు చేస్తున్న స్థానిక నాయకులు సూర్యనారాయణ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు

చోడవరం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానమంత్రి కౌసల్య వికాస్ యోజన కింద రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రెండు కోర్సులు ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. వెబ్ డెవలపర్, సెక్యూరిటీ అనలిస్టు అనే ఈ రెండు కోర్సుల్లో 30 చొప్పున 60 సీట్లు ఉంటాయని పేర్కొన్నారు. ఇంటర్ లేదా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసేందుకు 94947 91935 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

డిగ్రీ ఫస్టియర్‌కు స్పాట్ అడ్మిషన్లు

స్థానిక డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ తెలిపారు. బీఏ ఎకనామిక్స్ హానర్స్ బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ కెమిస్ట్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. సమన్వయకర్తలు నారాయణమూర్తి (8247 47025), ఎం.బాబు (99665 45448) లకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

పార్టీకి నష్టం కలిగిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ హెచ్చరిక

దేవరాపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్ట పడేవారికి గుర్తింపు ఉంటుందని, అలాగే, నష్టం కలిగించడానికి చూస్తే ఎవరైనా సస్పెండ్ చేస్తానని టీడీపీ నేత, స్థానిక ఎమ్మెల్యే బండారు.సత్యనారాయణమూర్తి హెచ్చరించారు. స్థానిక రైవాడ అతిథి గృహం ఆవరణలో మండల కమిటీ, గ్రామకమిటీలకు ఎంపికైన వారికి సన్మాన సభ గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్య కర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. పదవులు రాలేదని నిరాశ పడవద్దని త్వరలో రాష్ట్ర, జి ల్లా, మండలస్థాయిలో పదవుల్లో పార్టీకి కష్టపడే వారికి పూర్తి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

సభలో గలాటా

బండారు మాట్లాడుతుండగా మారేపల్లికి చెందిన సీనియర్ కార్యకర్త కిల్లిగోవింద దూసుకుంటూవేదిక ముందుకు వచ్చిన తనకు సమాచారం లేదంటూ కొంత మందితో ఘర్షణకు దిగారు. ఎమ్మెల్యే బండారు, పార్టీ పరిశీలకుడు ఏసుదాసు ఎంత చెప్పినా వినక పోవడంతో పార్టీ నుంచి అతనిని సస్పెండు చేస్తున్నట్టు ప్రకటించారు. వైసీపీకీ కోవర్టుగా పనిచేసి పార్టీలో పదవులు పొందడానికి చూస్తే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు. తెలుగు దేశం పార్టీ క్రమ శిక్షణతో కూడికున్నదన్నారు. పార్టీలో ఉంటూ వ్యతిరేకంగా ఉంటే సహించేదిలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, జలాశయ ఛైర్మన్ పాత్రునాయుడు, మాజీ ఎంపీపీలు కిలపర్తి.భాస్కరరావు, రావాడ సింహాద్రినాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చిటి.మిరెడ్డి.సూర్యానారాయణ, చెరకాన సూర్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దేవరాపల్లిలో ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మధ్యాహ్న భోజనం రుచికరంగా లేదు

» సోషల్ ఆడిట్ అధికారుల వద్ద విద్యార్థుల మొర


మోడల్ స్కూల్ విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్‌పీ అశోక్‌కుమార్

రావికమతం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నం భోజనం రుచికరంగా లేక తినలేకపోతున్నామని మరుపాక మోడల్ స్కూల్ విద్యార్థులు సోషల్ ఆడిట్ డీఆర్‌పీ ఎదుట వాపోయారు. స్కూల్‌లో ఏపీ సోషల్ ఆడిట్ అక్రెట్ బిల్టీ అండ్ ట్రాన్స్‌ఫరన్సి సంస్థకు చెందిన డీఆర్‌పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం భోజనం, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల విద్యాప్రమాణాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో మధ్యాహ్న భోజనం రుచికరంగా లేదని వసతి సౌకర్యంలేక రోజూ దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు రావడం కష్టమౌతోందని చిన్నారులు మొరపెట్టుకున్నట్టు తెలిసింది. దీనిపై డీఆర్‌పీ అశోక్‌కుమార్‌ను సంప్రదించగా తనిఖీ వివరాలను వెల్లడించలేమని, దీనిపై నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.

అద్దె భవనంలో రైతు సేవా కేంద్రంపై ఫిర్యాదు

రావికమతం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుడ్డిపలో రైతు సేవా కేంద్రం వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు భవనంలో నిర్వహించడంపై ఎంపీటీసీ సభ్యుడు గంజి సూర్యానారాయణ, ఆగ్రామ టీడీపీ నాయకులు గల్లా నానిబాబు తదితరులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. గుడ్డిప గ్రామంలో ప్రభుత్వ భవనం ఉన్నా ఉన్నటికీ రైతు సేవాకేంద్రాన్నికి అద్దెకు తీసుకోవడంపై ఆక్షేపించారు.

పనిదినాల్లో పిక్నిక్.. సచివాలయాల్లో కుర్చీలు ఖాళీ

జనాలు ఇబ్బందులు


రోలుగుంట సచివాలయంలో గురువారం ఉదయం ఉద్యోగులు పిక్నిక్‌కు వెళ్లడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

రోలుగుంట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : పనిదినాల్లో మండల స్థాయి అధికారులు పిక్నిక్‌లు ఏర్పాటుతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోలుగుంట గ్రామ సచివాలయ ఉద్యోగులు గురువారం మండలంలోని ఏంకే పట్నం శివారున ఓ ప్రైవేటు రిసార్ట్‌లో పిక్నిక్‌ను ఏర్పాటు చేసుకున్నారు. 16 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న అన్ని శాఖల ఉద్యోగులు ఉదయం కార్యాలయాలకు వచ్చి బయోమెట్రిక్ వేసుకుని పిక్నిక్‌కు వెళ్లిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పనుల పై కార్యాలయాలకు వెళ్లిన ప్రజలకు సమాధానం చెప్పేవారు కరవయ్యారు. సాయంత్రం వరకు ఉద్యోగులు సచివాలయాలకు రాకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అత్యవసర పనులు, బ్యాంకుల్లో రుణాలకు 1బీ, అడంగల్‌లు, ఇతర పనులపై ప్రజలు వెళ్లగా.. ఆయా సచివాలయాలకు వెళ్తే..ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ముందస్తు సమాచారం లేకపోవడంతో గంటలకొద్దీ ఎదురుచూసి వెనుతిరిగారు. ఈ విషయంపై ఎంపీడీఓ నాగేశ్వరరావు 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా, కలెక్టర్ ఆదేశాలతోనే పిక్నిక్‌ను ఏర్పాటు చేశామన్నారు. రిపోర్టు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారని ఎంపీడీఓ తెలిపారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డులో యథేచ్ఛగా చెట్ల నరికివేత

» విద్యుత్ స్తంభాల ఏర్పాటు పేరిట తొలగింపు

» అనధికార దందా అంటూ ఆరోపణలు

» అనుమతి లేదు: ఆర్‌అండ్‌బీ జేఈ సాయిశ్రీనివాస్


నరికివేత తర్వాత మిగిలిన చెట్టు మొదలు

మాడుగుల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాల ఏర్పాటు పేరిట మండలంలోని తాటిపర్తి నుంచి బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వరకు ఆర్ అం డ్‌బీ రోడ్డుకు ఇరువైపు లా ఉన్న వృక్షాలను నరికేస్తున్నారు. అర్‌అండ్‌బీ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా ఈ వ్యవహారం సాగుతోంది. వేప, పనస, మామిడి వంటి పలు రకాల భారీ చెట్లను తొలగిస్తున్నారు. కార్మికులు, టాక్టర్ డ్రైవర్‌ని ప్రశ్నిస్తే తమకేమీ తెలియదు కరెంట్ పనుల కోసం చెట్లను నరికి ముకుందపురం తీసుకు రావాలని విద్యుత్ అధికారులు సూచినట్టు చెబుతున్నారు. అయితే,అధికారుల అనుమతులు లేకుండా కొందరు ఇలా చెట్లను నరికి వ్యాపారం సాగిస్తున్నారని కాశీపురానికి చెందిన పలువురు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ చెట్ల నరికివేతకు తాము అనుమతి ఇవ్వలేదని మాడుగుల విద్యుత్ అధికారులు తెలిపారు. అలాగే, ఆర్‌అండ్‌బీ జేఈఈ పి. సాయి శ్రీనివాస్ వద్ద ఈ విషయం ప్రస్తావించగా, విద్యుత్ అధికారులు తమ వద్ద అనుమతి తీసుకోలేదని స్పష్టంచేశారు. అధికారులకు తెలియకుండా చెట్టు నరికి ఏపీ31ఈహెచ్ 9268 టాక్టర్‌పై యథేచ్ఛగా తరలించుకుపోతున్నా రెండు శాఖల అధికారులు మిన్నకుండడంపై పలువురు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. నరికిన చెట్ల ద్వారా ఆదాయంలో కొంత కార్మికులు, చెల్లించి మిగిలింది నగదు ఆర్‌అండ్‌బీకి చెందుతుందని మాడుగుల ఆర్‌అండ్‌బీలో పనిచేస్తున్న సిబ్బంది పేర్కొంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పచ్చగా ఉన్న చెట్ల నరికివేతలో భాగస్వాములపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


టాక్టర్‌పై తరలిస్తున్న దుంగలు

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ


వడాది పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న జిల్లా అధికారులు

బుచ్చెయ్యపేట నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలో వడ్డాది లో పిచ్చి కుక్క స్వైర్యవిహారం చేసి 10 మందిని గాయపరిచిన విషయం తెలిసిందే. వారికి అందించిన వైద్యంపై జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ చంద్రదేవ్, జిల్లా లెప్రసీ అధికారిణి స్వప్న లు గురువారం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వారికి అందించిన వైద్యం పై ఆరాతీశారు. వ్యాక్సిన్ నిల్వలు పరిశీలించి అందరికి క్రమం తప్పకుండా వ్యాక్సిన్ ఇవ్వాలని వెద్యాధికారి రమ్య దుర్గను ఆదేశించారు. కుక్కకాటు బాధితులకు అవసరమైన వ్యాక్సిన్, మందులు నిల్వ గదిని పరిశీలించారు.

చీడికాడ పీహెచ్‌సీలో..

చీడికాడ: స్థానిక పీహెచ్‌సీని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ చంద్రదేవ్, జిల్లా లెప్రసీ అధికారిణి స్వప్న గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా రికార్డులపరంగా ఇంజక్షన్‌లను తనిఖీ చేశారు. రికార్డులు స్వప్న తనిఖీ చేశారు. ఈ ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు సునీల్ కుమార్ , మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో మాజీ మంత్రి అమర్ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన


చోడవరం- గోవాడ రూట్లో ఇంటి నిర్మాణానికి భార్యతో కలిసి శంకుస్థాపన చేస్తున్న మాజీమంత్రి అమర్

చోడవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్, స్థానికంగా సొంత ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బీఎన్ రోడ్డుకు సమీపంలోని చోడవరం-గోవాడ మధ్యలో గురువారం భార్యతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమర్ తల్లి నాగమణితో పాటు, వైసీపీ జిల్లా నాయకులు ప్రసాద్, ఏడువాక సత్యారావు, దొండా రాంబాబు, దొండా వరహాలదొర, నెహ్రూ, బైన ఈశ్వరరావు, పుల్లేటి వెంకటేష్, సత్య, శరగడం నాగేశ్వరరావు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అమర్ ఇక్కడనుంచి పోటీ చేస్తారా.. లేదా అనే సందేహాలు పార్టీ కేడర్‌లో నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే స్థానికంగా సొంత ఇంటి నిర్మాణానికి అమర్ శ్రీకారం చుట్టడంతో,ఈ ప్రచారాలకు తెరదించినట్టయిందని అంటున్నారు.

జెండర్ రీసోర్స్ కేంద్రం ప్రారంభం

కె.కోటపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘం సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్స్ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు గ్రామ సంఘాల్లో ఉన్న మహిళలకు సంబంధించిన సమస్యలు చ ర్చించడానికి ఈ కేంద్రం ఎంతో దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ రత్నప్రభ, ఎంపీడీవో సాంబశివరావు, తహసీల్దార్ భుజంగరావు, టీడీపీ మండల అధ్యక్షులు రొంగలి మహేష్, సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని, వెలుగు ఏపీఎం చినబాబు, సీసీ వెంకటరావు, రాంబాబు, సత్యనారాయణ, సింహాచలంనాయుడు, ఉమా మహేశ్వరి, సురేష్, మల్లేశ్వరి, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

భవిష్యత్తు సిటీగా విశాఖ

- ప్రపంచ స్థాయి ఐటీ సంస్థలు రాక
- యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా కష్టపడుతున్నాం
- అన్ని రంగాల్లో అగ్రస్థానంలో రాష్ట్రం
- ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి విశాఖపట్నం భవిష్యత్తు సిటీగా మారబోతుందని ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యువతకు పెద్దఎత్తున ఉద్యోగ కల్పన కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా విశాఖలో ప్రముఖ ఐటీ కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎండాడలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ (డబ్ల్యూటీసీ) నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేసి, శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఏపీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. తాను రెండోసారి ఐటీ శాఖ మంత్రిగా ప్రమాణం చేసినప్పటి నుంచి రాష్ట్రంలో ఐటీ సెక్టార్ దూసుకుపోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నానన్నారు. విశాఖలో త్వరలో 30 వేల ఉద్యోగాలు వస్తున్నాయని, గూగుల్ సంస్థను ఇక్కడికి తీసుకువచ్చేందుకు ఎంతో శ్రమించామన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించిందన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్‌తో పాటు ప్రపంచంలో ప్రముఖ సంస్థలన్నీ విశాఖలో తమ కార్యకలాపాలను ప్రారంభించనున్నాయని, యువతకు ఉద్యోగావకాశాలు మరింత మెరుగవుతాయన్నారు.

పారిశ్రామికీకరణ దిశగా...

అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. నమో అంటే నాయుడు, మోదీ అనేలా డబుల్ ఇంజన్ సర్కారు బుల్లెట్‌లా దూసుకుపోతోందన్నారు. ఎన్నికల్లో తనకంటే ఎక్కువ మెజారిటీ వచ్చిన నేతలు వేదికపైనే ఉన్నారని, పార్లమెంట్ పరంగా ఎంపీ భరత్ అత్యధిక మెజారిటీతో గెలిచారని, 2019 ఎన్నికల్లో ఏపీలో ఓటమి చూసిన విశాఖ ప్రజలు తెలుగుదేశానికి పట్టం కట్టారని, వారి అభిమానానికి తగ్గట్టుగా అభివద్ధి చేసి చూపిస్తామన్నారు.

అన్ని రంగాల్లో అగ్రపథం

అన్ని రంగాల్లో ఏపీ అగ్రస్థానంలో నిలిచిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్‌ను ఎలా తీర్చిదిద్దారో రాష్ట్రాన్ని కూడా నూతన శకం వైపు నడిపిస్తారన్నారు. వచ్చే ఏడాదికి భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందని, దీంతో ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూస్తుందన్నారు.

లోకేశ్ అవిరళ కృషి: ఎంపీ శ్రీభరత్

విశాఖకు అనేక పారిశ్రామిక, ఐటీ సంస్థలు రావడంలో మంత్రి లోకేశ్ కృషి చాలా ఉందని, ఆయన కష్టంతో ఇక్కడి యువతకు ఉద్యోగావకాశాలు లభించడం ఆనందించదగిన విషయమని ఎంపీ ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచమంతా విశాఖ వైపు చూస్తోందని, గూగుల్ లాంటి దిగ్గజ సంస్థను తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువ నేత లోకేశ్‌కే సాధ్యమయిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సమ్మిట్ పెట్టి అప్పడాల హబ్, మటన్ మార్టులు, చేపల దుకాణాలు తీసుకువస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ ఐటీ సంస్థలు వస్తున్నాయన్నారు.

మంత్రికి ఐటీ సంస్థల కృతజ్ఞతలు

గత ప్రభుత్వంలో రావాల్సిన ఇంటెన్సివ్‌లను చెల్లించడంలో మంత్రి లోకేశ్ కీలకపాత్ర పోషించారని, ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఐటీ కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. విశాఖలో ఐటీ రంగం లోకేశ్ కృషితో అగ్రపథాన దూసుకుపోతుందనే నమ్మకం కలుగుతోందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, విశాఖ వరల్డ్ ట్రేడ్ సెంటర్ చైర్మన్ వరప్రసాద రెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, డబ్ల్యూటీసీ డైరెక్టర్ వంశీకృష్ణ, స్థానిక నాయకులు, ఐటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రీజియన్ అభివృద్ధికి న్యూ విజన్

- విశాఖ ఎకనామిక్ రీజియన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- 2047 నాటికి 750 నుంచి 800 బిలియన్ డాలర్ల ఆదాయం లక్ష్యం
- ఏడు గ్రోత్ డ్రైవర్ల ఎంపిక

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సరికొత్త విజన్, యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి, భారీ పరిశ్రమల ఏర్పాటు, పరుగులు పెట్టనున్న అభివృద్ధి...ఇదీ విశాఖ ఎకనామిక్ రీజియన్ డాక్యుమెంట్ ధ్యేయం. శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకు విస్తరించిన ఈ రీజియన్‌కు సంబంధించిన డాక్యుమెంట్‌ను గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నీతి ఆయోగ్ చైర్మన్ బీవీఆర్ సుబ్రహ్మణ్యం విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్‌లో పలు విషయాలపై సీఎంతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వివరించారు.

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలతో ఏర్పాటుకానున్న రీజియన్‌కు సంబంధించి 2024లో ఆదాయం 52 బిలియన్ డాలర్లు కాగా 2032కల్లా 125 నుంచి 135 బిలియన్ డాలర్లకు చేరుకోవాలని లక్ష్యంగా నిర్ణయించారు. అదే 2047 నాటికి 750 నుంచి 800 బిలియన్ డాలర్లకు చేరుకోవాలని నిర్దేశించారు. ప్రస్తుతం రాష్ట్ర జనాభా 5.3 కోట్లు కాగా అందులో ఎకనామిక్ రీజియన్ జనాభా 31 శాతం, విస్తీర్ణంలో 23 శాతం, జీడీపీలో 30 శాతం ఉంది. రాష్ట్ర తలసరి ఆదాయం 3,230 డాలర్లు కాగా ఈ రీజియన్ పరిధిలో 3,170 డాలర్లు ఉంది. అయితే 2032 నాటికి రీజియన్ తలసరి ఆదాయం 7,400 డాలర్లు, 2047 నాటికి 42 వేల నుంచి 44 వేల డాలర్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు.

అభివృద్ధికి ఏడు హబ్‌లు

రీజియన్ అభివృద్ధి కోసం మొత్తం ఏడు హబ్‌లను తయారుచేయాలని గుర్తించారు. వస్తువుల ఉత్పత్తి, ఐటీ, ఏఐ ఇన్నోవేషన్, గ్లోబల్ అగ్రికల్చర్ లీడర్, పర్యాటకం, హెల్త్, అర్బన్ హౌసింగ్, మౌలిక వసతుల కల్పలో స్వావలంబన సాధించేలా హబ్‌లు పనిచేయనున్నాయి. మొత్తం ఆరు పోర్టులు, 12 మేజర్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేస్తారు. రీజియన్‌లో 18 వ్యవసాయాభివృద్ధి ప్రాంతాలు, ప్రపంచస్థాయి నర్సరీలు, ఐదు ఫిషింగ్ హార్బర్లు, గుడ్ల ఉత్పత్తి కేంద్రాలు వస్తాయి. భోగాపురంలో ఏరో సిటీ, ఐఐఎం సమీపంలో ఎడ్యుకేషన్ స్కిల్ కేంద్రం, ఆనందపురంలో ఐటీ డేటా సెంటర్, విజయనగరంలో కేబుల్ ల్యాండ్ స్టేషన్, కాపులుప్పాడలో ఐటీ, జీసీసీ సెంటర్లు, మధురవాడలో ఐటీ పార్కు, 13 చోట్ల పర్యాటక కేంద్రాలు ఏర్పాటుచేస్తారు. మూలపేటలో పారిశ్రామిక నగరం, శ్రీకాకుళంలో కొబ్బరి, జీడి తోటల పెంపకం, అనకాపల్లిలో అల్యూమినియం, గ్రీన్ హైడ్రోజన్, క్లీన్ టెక్ మ్యానుఫ్యాక్చరింగ్, బల్క్‌డ్రగ్ సిటీ, ఏటికొప్పాక కల్చరల్ విలేజ్, కాకినాడ, యానాంలో రివర్ క్రూయిజ్, కాకినాడలో గేట్‌వే పోర్టు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కాఫీ, జీడితోటల పెంపకంపై ఫోకస్ పెడతారు.

సదస్సుకు మూడంచెల భద్రత

- ఏర్పాట్లు పరిశీలించిన డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఐఐ సదస్సుకు మూడు అంచెల్లో పటిష్ట భద్రతను ఏర్పాటుచేశారు. మద్దిలపాలెం కూడలితోపాటు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ జంక్షన్, ఎస్పీ బంగ్లా జంక్షన్ వద్ద పోలీసు పికెట్‌లు ఏర్పాటుచేసి, సదస్సు జరిగే ఏయూ మైదానం వైపు కేవలం పాస్‌లు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తున్నారు.

సదస్సు ప్రాంగణంలోకి ప్రవేశించే రెండు మార్గాల వద్ద పోలీసు బందోబస్తు ఉంటుంది. ప్రతినిధులు, అధికారులతోపాటు పాస్‌లు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తారు. ప్రాంగణం లోపల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ముగ్గురు ఐపీఎస్ అధికారుల పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహిస్తారు.

డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా పర్యవేక్షణలో సీపీ శంఖబ్రతబాగ్చి ఆధ్వర్యంలో ఎనిమిది మంది ఐపీఎస్‌లు, మరో ఎనిమిది మంది అదనపు ఎస్పీలు, 32 మంది డీఎస్పీలు, 89 మంది సీఐలు, 192 మంది ఎస్ఐలు, సుమారు రెండు వేల మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రాంగణంలోని ప్రధాన వేదిక, ఇతర సమావేశ హాళ్లు, ప్రతినిధుల క్యాబిన్‌లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, ఎగ్జిబిషన్ హాల్‌తోపాటు కమాండ్ కంట్రోల్‌రూమ్, పార్కింగ్ ప్రాంతాలను డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా గురువారం పరిశీలించారు.

అచ్యుతాపురం తహసీల్దార్ బదిలీ

అచ్యుతాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ జి.సత్యనారాయణను బదిలీ చేస్తూ కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలు జారీ చేశారు. అయితే ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా కలెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఎలమంచిలి తహశీల్దార్ వరహాలు అచ్యుతాపురం మండలానికి ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఆయన గురువారం సాయంత్రం ఇక్కడ ఎఫ్ఏసీగా బాధ్యతలు తీసుకున్నారు. తహశీల్దార్ బదిలీకి భోగాపురం గ్రామంలోని భూ వివాదమే కారణని రెవెన్యూ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నారు. ఇదే అంశానికి సంబంధించి సీఐ నమ్మి గణేశ్‌ను విశాఖపట్నం రేంజ్‌కి అటాచ్ చేస్తూ డీఐజీ గోపీనాథ్ జట్టి ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. కొద్ది రోజుల వ్యవధిలోని ఇద్దరు అధికారులకు స్థానచలనం కలిగించడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. భోగాపురంలో సుమారు 33 ఎకరాలకు సంబంధించి భూ వివాదం నాలుగు దశాబ్దాలుగా నడుస్తున్నది. ప్రస్తుతం ఈ భూమి విలువ సుమారు రూ.300 కోట్లు వుంటుందని చెబుతున్నారు. రెండు వర్గాల మధ్య నడుస్తున్న ఈ భూ వివాదంలో సీఐ, తహశీల్దారు రాజకీయ ఒత్తిడితో ఒక వర్గానికి కొమ్ముకాస్తున్నట్టు రాజధాని స్థాయిలో ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదులు వెళ్లినట్టు సమాచారం. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం తొలుత సీఐపై చర్యల్లో భాగంగా డీఐజీ కార్యాలయాలనికి అటాచ్ చేసినట్టు చెబుతున్నారు. తాజాగా తహశీల్దారును అక్కడి నుంచి బదిలీ చేసి, ఎక్కడా పోస్టింగు ఇవ్వకుండా కలెక్టరేట్‌లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈ భూ వివాదానికి సంబంధించి మరో ముఖ్య అధికారిపైనా బదిలీ వేటు పడుతుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఆలయాల్లో హుండీ చోరుల అరెస్టు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో రాత్రిపూట హుండీల చోరీకి పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చోడవరం, బుచ్చెయ్యపేట, వి.మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి మండలాల్లోని పలు ఆలయాల్లో ఇటీవల హుండీల చోరీ జరిగాయన్నారు. వీటికి సంబంధించి కేసులు నమోదు చేసిన పోలీసులు చోడవరం శివారు గౌరీపట్నం వద్ద ముగ్గురిని పట్టుకున్నారని తెలిపారు. వీరిలో ఇద్దరు మైనర్లు వున్నారని, 26 కేసులకు సంబంధించి 10.32 గ్రాముల బంగారం, 26 తులాల వెండి, రూ.44,218 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ చెప్పారు. నిందితులను అరెస్టు చేసి, మైనర్లను జువెనైల్ హోమ్‌కు, మరో యువకుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. మరొక మైనర్ నిందితుడి కోసం గాలిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా చోడవరం సీఐ పి.అప్పలరాజును, సిబ్బందిని అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

పాఠశాల ఈతకొలనులో విద్యార్థి మృతి

... 5వ పేజీ తరువాయి

పక్కన వదిలేసి, స్కూలుకు తాళాలు వేసి ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. స్కూలు బస్సులో పెద్ద కుమారుడు ఇంటికి వచ్చి, చిన్న కుమారుడు రాకపోవడంతో తల్లి, కుటుంబ సభ్యులు ఆందోళనతో పాఠశాలకు వెళ్లారు. అక్కడ విగతజీవిగా పడివున్న కుమారుడిని చూసి భోరున విలపించారు. పాఠశాల నిర్వాహకులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఆందోళనకు దిగారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

ఎలమంచిలికి చెందిన జనపరెడ్డి శ్రీలత, శ్రీనివాసరావు దంపతులకు ప్రశాంత్, మోక్షిత్ సందీప్ కుమారులు. మునగపాక మండలం తిమ్మరాజుపేటలోని డావిన్సీ స్కూలులో పెద్ద కుమారుడు ఆరో తరగతి, చిన్న కుమారుడు మొదటి తరగతి చదువుతున్నారు. రోజూ ఎలమంచిలి నుంచి స్కూలు బస్సులో వచ్చి వెళుతుంటారు. గురువారం సాయంత్రం ఇంటికి పెద్ద కుమారుడు ఒక్కడే వచ్చాడు. తమ్ముడు ఏడని తల్లి అడగ్గా.. బస్సు ఎక్కలేదని చెప్పాడు. దీంతో ఆందోళన చెందుతూ స్కూల్‌కు ఫోన్ చేశారు. కానీ ఎవరూ స్పందించకపోవడంతో సందీప్ తల్లి, పెదనాన్న, కుటుంబీకులు హుటాహుటిన పాఠశాలకు వెళ్లారు. సందీప్ గురించి వాచ్‌మన్‌ను అడిగితే తనకేమీ తెలియదన్నాడు. తరగతి గదులతోపాటు ఆవరణలో వెతికారు. స్విమ్మింగ్ పూల్ పక్కన సందీప్ పడివుండడాన్ని చూశారు. దగ్గరకు వెళి పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్టు గుర్తించారు. దీంతో కన్నీరుమున్నీరు అయ్యారు. విద్యార్థి చనిపోయిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియపరచకుండా పాఠశాల యాజమాన్యం గోప్యంగా వుంచడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ పి.ప్రసాదరావు, సిబ్బందితో కలిసి పాఠశాల వద్దకు వచ్చారు. కొద్దిసేపటికి సీఐ, తహశీల్దారు, ఎంఈవోలు చేరుకున్నారు. పాఠశాల నిర్వాహకులకు ఫోన్లు చేశారు. కానీ అటువైపు నుంచి స్పందన లేకపోవడంతో ఆందోళనకారుల్లో ఆగ్రహం మరింత పెరిగింది. స్కూల్ అద్దాన్ని పగలు గొట్టారు. ఎస్ఐ వారిని వారించారు. పాఠశాల నిర్వాహకులను వెంటనే ఇక్కడకు రప్పించాలని, అంతవరకు కదిలేదంటూ పాఠశాల ఎదురుగా వున్న అనకాపల్లి- అచ్యుతాపురం మెయిన్ రోడ్డుపై భైఠాయించారు. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. అర్ధరాత్రి 12.30 గంటల సమయానికి కూడా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. పాఠశాల నిర్వాహకులు రాలేదు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఏఈఈ సస్పెన్షన్

... 5వ పేజీ తరువాయి

సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ సిబ్బందిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్యాంకును ప్రారంభించకుండా వెళ్లిపోయారు. అంతేకాక ట్యాంకు నిర్మాణంలో నాణ్యతాలోపాలకు బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాని కలెక్టర్‌కు, సంబంధిత శాఖ మంత్రికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ వెంటనే స్పందిస్తూ ఆర్‌డబ్లూఎస్ డీఈఈ ఆనంద్, ఏఈఈ మనోజ్‌కల్యాణ్‌లను సస్పెండ్ చేశారు. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టారు.

వాటర్ ట్యాంకు నాణ్యతపై తనిఖీలు

పెట్టుగోళ్లపల్లిలో నాణ్యతాలోపంతో నిర్మించిన వాటర్ ట్యాంకును గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ ఇషాన్ బాషా, ఎస్ఈ రామస్వామి, ఈఈ అనిల్‌కుమార్‌తోపాటు క్వాలిటీ కంట్రోల్ అధికారులైన డీఈ ప్రభాత్, ఏఈలు రమ్య అనూష, కార్తీక్ ఇక్కడకు వచ్చిన పరిశీలించారు. కట్టడానికి సంబంధించి కొన్నిచోట్ల శాంపిల్స్ సేకరించారు. రైతు సేవా కేంద్రం వద్ద నిర్మిస్తున్న వాటర్ ట్యాంకును కూడా పరిశీలించారు. జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన పనుల వివరాలను తెలుసుకుని, వాటికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ ఇషాన్ బాషా మాట్లాడుతూ, జల్ జీవన్ మిషన్ కింద ఇక్కడ జరిగిన పనులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తరువాత నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

క్రైం... crime news

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూల్‌బాగ్ రోడ్డులో బుధవారం రాత్రి ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై గురువారం ఉదయం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ట్రైనీ ఎస్ఐ గౌరి తెలిపారు. దీనికి సంబంధించి ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలాజీరావుపేటలో నివాసం ఉంటున్న పడాల అప్పారావు(40) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. మద్యానికి బానిసై 20 రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లిపోయాడు. బుధవారం పొద్దుపోయాక పూల్‌బాగ్‌రోడ్డులో పురుగుల మందు తాగి పడిపోయి ఉండడాన్ని స్థానికులు గుర్తించి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. వైద్యాలయంలో చికిత్స పొందుతూ రాత్రి 10 గంటలకు అప్పారావు మృతి చెందాడు. అతని కుమారుడు లోకేశ్ గురువారం ఉదయం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆమె తెలిపారు.

పెద్దేరు నదిలో గల్లంతైన వ్యక్తి మృతి

బుచ్చెయ్యపేట, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలో వడ్డాది వద్ద పెద్దేరు నదిలో మంగళవారం గల్లంతైన వ్యక్తి గురువారం శవమై తేలాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డాది గ్రామానికి చెందిన మెగ్గ నాగఅప్పారావు మంగళవారం పెద్దేరు నదిలో చేపల వేటకు వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గజఈతగాళ్లను రప్పించి నదిలో గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం పెద్దేరు నదిలో మృతదేహం తేలినట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతిచెందిన వ్యక్తి నాగఅప్పారావుగా కుటుంబ సభ్యులు గుర్తించారు. ఇతనికి భార్య, కుమారుడు వున్నారు.

కట్నం వేధింపులతోనే ఆత్మహత్య

- మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపణ
- ఉపాధ్యాయుడైన భర్తపై పోలీసులు కేసు నమోదు


పెళ్లయిన కొత్తలో వీణ, ఉమామహేశ్వరరావు (ఫైల్ ఫొటో)

చోడవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కనకమహాలక్ష్మినగర్‌లో వివాహిత తన ఆరు నెలల పసిబిడ్డను చంపి, ఆపై ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనకు సంబంధించి భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఉపాధాయుడైన భర్త పెడుతున్న కట్నం వేధింపుల కారణంగానే ఆమె బలవన్మరణానికి పాల్పడినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

బుచ్చెయ్యపేట మండలం కేపీ అగ్రహారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పి.ఉమామహేశ్వరరావు చోడవరంలోని కనకమహాలక్ష్మి గర్‌లో భార్య వీణ(29) ఆరు నెలల కుమారుడు వియాన్‌తో నివాసం వుంటున్నాడు. బుధవారం సాయంత్రం ఆమె వియాన్‌ను చంపి, అనంతరం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై అనకాపల్లి డీఎస్పీ శ్రావణి గురువారం ఉదయం ఇక్కడకు వచ్చి దర్యాప్తు చేపట్టారు. వీణ ఆత్మహత్య చేసుకున్న ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు వచ్చి వీణ ఆత్మహత్యకు ఉపయోగించిన తాడును, ఇతర ఆధారాలను సేకరించారు. ఈ సందర్భంగా మృతురాలి భర్త ఉమామహేశ్వరరావును డీఎస్పీ విచారించారు. వీణ తల్లిదండ్రులు, సోదరుడితో ఆమె మాట్లాడారు. వరకట్న వేధింపుల కారణంగానే వీణ ఆత్మహత్య చేసుకుందని వారు ఆరోపించారు. తమది పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం గుమడ గ్రామమని, ఇదే మండలానికి చెందిన ఉమామహేశ్వరరావు, వీణను ప్రేమించి 2024లో పెళ్లి చేసుకుడన్నారు. పెళ్లికి ముందు మూడు ఎకరాల పొలం అమ్మి ఉమామహేశ్వరరావుకు రూ.21 లక్షల కట్నంగా ఇచ్చినట్టు పేర్కొన్నారు. కొంత కాలంపాటు భార్యతో సఖ్యతగానే వున్న అతను.. తరువాత మరింత కట్నం తేవాలంటూ మానసికంగా, శారీరకంగా వేధించేవాడని వారు ఆరోపించారు. భర్త వేధింపులపై పలుమార్లు తమకు ఫోన్ చేసి కన్నీంటిపర్యంతం అయ్యిందన్నారు. బుధవారం ఉదయం ఉమామహేశ్వరరావు స్కూలుకు వెళ్లే ముందు వీణతో గొడవ పెట్టుకుని, సూటిపోటి మాటలతో వేధించాడని, దీంతో తీవ్రమనస్తాపం చెందిన ఆమె తొలుత చిన్నారిని చంపేసి, అనంతరం తాను ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు: డీఎస్పీ

అదనపు కట్నం కోసం వేధించడం వల్లే వీణ ఆత్మహత్యకు పాల్పడిందని, ఈ ఘటనపై ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడు ఉమామహేశ్వరరావుపై కేసు నమోదు చేశామని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. ఈ ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆమె వెంట సీఐ బి.అప్పలరాజు, ఎస్ఐ నాగకార్తీక్ వున్నారు.

రాష్ట్ర స్థాయి విలువిద్య టోర్నీకి ఉమ్మడి విశాఖ జట్టు

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల మహిళా విలువిద్య చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి విశాఖ జట్టు సభ్యులను గురువారం ప్రకటించారు. విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో ఇండియన్ రౌండ్, రికర్డ్, కాంపౌండ్ రౌండ్ ఈవెంట్లలో ఉమ్మడి విశాఖ నుంచి 17 మంది ప్రాతినిధ్యం వహించనున్నట్టు జిల్లా అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. పురుషుల విభాగంలో బైరాగి నాయుడు, హర్షవర్దన్, యశ్వంత్‌నాయుడు, గణేష్ మణిరత్నం, సాంబశివ, మోహిత్ సాయి, దేశయ్య, సంతోష్, రాహుల్, ప్రణీత్‌కుమార్, ప్రశాంతరెడ్డి, హరీశ్‌చంద్ర, పూర్వ రాథోడ్, భాస్కర్, మహిళల కేటగిరీలో సాయిమనస్వి, మోహిత, హర్షిత, సాహితీరత్న పాల్గొంటారన్నారు.

అంచనాలకు మించి పెట్టుబడులు

... 5వ పేజీ తరువాయి

భాగంగా అనకాపల్లి జిల్లా నుంచి విజయనగరం మీదుగా శ్రీకాకుళం జిల్లా వరకై అవుటర్ రింగ్‌రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదించామని, దీనిపై మరింత సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించామన్నారు. అవుటర్ రింగ్‌రోడ్డులో భాగంగా చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. మాడుగుల, చోడవరం ప్రాంతంలో ఒక సెజ్ ఏర్పాటుచేయాలని ఇప్పటికే ప్రతిపాదించామన్నారు. పారిశ్రామికంగా ఆ రెండు అసెంబ్లీ సెగ్మెంట్‌లు అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

విశాఖ, పరిసరాల్లో అనేక పరిశ్రమలు రానుండడంతో పెద్దఎత్తున యువతకు ఉపాధి లభిస్తుందని, తద్వారా ఆర్థిక వృద్ధిరేటు పెరుగుతుందన్నారు. ఈ విషయాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులపై ఉందని చంద్రబాబునాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పారిశ్రామిక అభివృద్ధి జరుగుతున్న వేళ...ప్రజలకు ప్రతి విషయం చెప్పాలని, అప్పుడు మీ కేరీర్‌లో ఇదో ల్యాండ్‌మార్క్ అవుతుందని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు, అభివృద్ధిని ప్రజలకు చెప్పడం ద్వారా వారితో అనుబంధం మరింత బలపడుతుందని అన్నారు. ముఖ్యమంత్రితో సమావేశమైన వారిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, కోండ్రు మురళి, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.ప్రణవ్‌గోపాల్, ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, తదితరులు ఉన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	595
విజయనగరం	599
శ్రీకాకుళం	599